కలం **నిఘా**

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ శనివారం 21 జూన్ 2025 సంపుటి: 15, సంచిక: 76, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


60 యుద్ధ విమానాలతో

## ఇరాన్‌లో నిప్పుల వర్షం



కురిపించిన ఇజ్రాయెల్.. వందల మంది మృతి

2




కంటతడి పెట్టిన

## రాష్ట్రపతి ముర్ము

అంధ విద్యార్థుల గీతాలాపనతో భావోద్వేగం

2

బనకచర్లపై...

# మాట్లాడుకుంటాం

కిషన్ రెడ్డికి ట్యూషన్ మాస్టర్ కేసీఆర్..
కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్ కిషన్ రెడ్డి

- జల వివాదాల పరిష్కారానికి చంద్రబాబుతో చర్చలకు సిద్ధం
- తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు కోరుకోవడం లేదు
- కేసీఆర్, హరీష్ అబద్ధాలకు దేవుడే ఆశ్చర్యపోతాడు
- చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలంటే గోదావరి నీటిని తరలించాలి
- బీఆర్ఎస్ బతికి బట్ట కట్టాలంటే బనకచర్ల ఇష్యూ కావాలి
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎంరేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ జూన్ 20 (నిఘా న్యూస్)

బనకచర్ల అంశం గురించి కూర్చొని మాట్లాడుకుంటే వివాదం ఉండదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎపి సీఎంచంద్రబాబుతో కలసి మాట్లాడేందుకు తనకు అభ్యంతరం లేదన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బనకచర్ల-గోదావరి ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధమని ప్రకటించారు. 23న కేబినేట్ భేటీలో దీనిపై చర్చిస్తామని అన్నారు. ఎపి సిఎంను తామే ఆహ్వానిస్తామని

..మిగతా 2లో



గోదావరి వరద జలాలను ఏపీకి తరలించుకు పోయేందుకు అపెక్స్ కౌన్సిల్లో అప్పట్లో కేసీఆర్ ఆమోదం తెలిపారు



ఒత్తిడిని జయించేందుకు...

## యోగాను ఆచరిద్దాం

ఐదు లక్షల మందితో చేపట్టనున్న యోగాంధ్రలో పాల్గొనేందుకు విశాఖ చేరుకున్న ప్రధాని

విశాఖపట్నం జూన్ 20 (నిఘా న్యూస్)

విశాఖ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ భారత ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం చేరుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాని మోదీ శనివారం విశాఖపట్నంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. యోగా మన సంస్కృతి, సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించే యోగాను నిత్యం ఆచరిద్దామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో విశాఖ ఆర్కే బీచ్‌లో జరగనున్న యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం. రాష్ట్రంలో

..మిగతా 2లో

అసాంఘిక శక్తులకు మద్దతుగా

## మాట్లాడడం కూడా నేరమే

అది మర్చిపోవద్దు: పవన్ కల్యాణ్

అప్రజాస్వామికంగా మాట్లాడే వారిని ప్రజలు గమనించాలని పవన్ సూచన

మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందన

సినిమా డైలాగులు నిజ జీవితంలో కుదరవని హితవు

అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిక

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం



2

## ఎల్బీ స్టేడియంలో యోగా డే వేడుకలు



పాల్గొన్న గవర్నర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ జూన్ 20 (నిఘా న్యూస్)

ఎల్బీ స్టేడియంలో యోగా డే వేడుకలు.. పాల్గొన్న గవర్నర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ ఎల్బీనగర్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా డే 24 గంటల కౌంట్ డౌన్ ఈవెంట్‌ను

..మిగతా 2లో



కేంద్ర సహకారం లేకుండా...

## అభివృద్ధి పనులు జరగవు

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బీఆర్ఎస్ కలిసి పని చేస్తాయి

విజయంపై విశ్వాసంతో ఎన్నికల్లోకి వెళ్లాలి

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ జూన్ 20 (నిఘా న్యూస్)

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహనతో ఉన్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు

..మిగతా 2లో

పేదలకు మరో

## మూడు కోట్ల ఇళ్లు

ఆటవిక రాజ్యం నుంచి బీహార్‌ను బయటపడేశాం

బలమైన అభివృద్ధి దిశగా బీహార్ పయనం

మళ్లీ ఆటవిక రాజ్యం రాకుండా అడ్డుకోవాలి

బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ పిలుపు



పాట్నా జూన్ 20(నిఘా న్యూస్)

బీహార్‌ను ఆటవిక రాజ్యంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో

..మిగతా 2లో







2

కొండా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల

## అత్యవసర భేటీ

స్టేషన్ ఘన్‌పూర్‌లో కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టిస్తున్న కడియం

పరకాలలో 75 ఏళ్ల దరిద్రుడు ఎమ్మెల్యేగా ఉన్నారు

ఎమ్మెల్సీ కొండా మురళి వ్యాఖ్యలపై అధిష్టానం సీరియస్

## ఇంగ్లీష్ అంటే ఒక పవర్



ప్రపంచంతో పోటీపడేందుకు ఓ పరికరం

ఇంగ్లీష్ వద్దనడం పేదలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర

అమిత్ షా వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్

2

## పశ్చిమ బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే గ్రామానికి చెందిన 9 మంది యువకులు మృతి!

వివాహ వేడుకకు వెళ్లి వస్తున్న వారి కారును ఢీకొన్న ట్రక్కు

స్పాట్‌లోనే 9 మంది ఝూరండ్ వాసులు మృతి

2

# బనకచర్లపై మాట్లాడుకుంటాం

మొదటి పేజీ తరువాయి...

కూడా అన్నారు. ఏపీ, కేంద్రానికి పీఎఫ్ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదల్యైంది. పీఎఫ్ఆర్ ఇచ్చేముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేదికాదు. ఆంధ్రప్రదేశ్ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫ్ఆర్) ఇచ్చిన వెంటనే కేంద్రం స్పందిస్తోంది. బనకచర్లపై కేంద్రం అన్ని రకాల చర్యలకు సిద్ధమైంది. ఇద్దరు సీఎంలు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం. ఒక రోజు కాదు నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాలమధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయన్నారు. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం. వివాదాల పరిష్కారంలో నాకెలాంటి బేషజాలు లేవు. ఇద్దరు వ్యక్తులు కాదు రాష్ట్రాల మధ్య వ్యవహారం ఇది. విభజనచట్టం ప్రకారం ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే చెప్పుకోవాలి. విభజన చట్టం ప్రకారం గతంలో సీఎంల స్థాయిలో చర్చలు జరిపాం. అనేక అంశాలను సీఎం స్థాయిలో చర్చించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు. కింది రాష్ట్రంగా ఏపీకి హక్కులు ఉన్నాయంటున్నారు. అదే రకమైన హక్కులు తెలంగాణకు కూడా ఉంటాయి. ఈనెల 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉంది. కేబినెట్‌లో బనకచర్లపై చర్చిస్తాం. ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. మోదీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు సపోర్టు కావాలి. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలంటే గోదావరి నీటిని తరలించాలి. విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. బనకచర్లపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. 2016, 2018లో ఏపీ సర్కారు రెండు జీవోలు ఇచ్చింది. ఏపీ జీవోల ఆధారంగా వ్యాప్కోస్ 150 పేజీల నివేదిక ఇచ్చింది. గోదావరి-పెన్నా అనుసంధానంలో బనకచర్ల ఒక భాగం. 86 రోజుల్లో 400 టీఎంసీలు తరలించేలా బనకచర్ల డిజైన్ చేశారు. గోదావరిలో 968 టీఎంసీలు వాడే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కేటాయించింది వాడుకునేందుకు అవకాశం ఇవ్వట్లేదు. కేటాయింపులు వాడుకునే అవకాశం ఇవ్వక పోవడంతోనే వివాదం. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడం మంచిది. ఈ వివాదం పరిష్కారానికి ఎలాంటి డెడ్‌లైన్ లేదు' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రం ఏపీతో వివాదాలు కోరుకోవట్లేదని.. కానీ ఎవరి కోసమో మా హక్కులు వదులుకోబోమని తేల్చి చెప్పారు. జూన్ 23న కేబినెట్ భేటీ నిర్వహించి.. ఇందులో బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చిస్తామన్నారు. ఆ తర్వాత అవసరమైతే మేమే ఒక అడుగు ముందుకేసి బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ గవర్నమెంట్‌ని చర్చలకు ఆహ్వానిస్తామన్నారు. చర్చల ద్వారానే జల వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాలతో తెలంగాణ అనవసరమైన వివాదాలను కోరుకోవడం లేదని.. పైన ఉన్న కర్ణాటకతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లే ఏపీతోనూ మంచి రిలేషన్ కొనసాగించుకోవాలనేది మా విధానమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ సెంటిమెంటును అడ్డంపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తోందని, ఇప్పుడు గోదావరి జలాల ఇష్యూని చచ్చిపోయిన బీఆర్ఎస్ సంజీవనిలా వాడుకోవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణకు సాగునీటిలో విషయంలో అన్యాయం చేసిందే కేసీఆర్, హరీష్ రావు అని ఫైర్ అయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు బీజం పడిరదే 2016 బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అని గుర్తు చేశారు. 2016-2018లో బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వే చేయాలని ఏపీ ప్రభుత్వం జీవోలు ఇచ్చిందని.. అప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెప్పలేదు అన్నారు

## కంటతడి పెట్టిన రాష్ట్రపతి ముర్ము

### అంధ విద్యార్థుల గీతాలాపనతో భావోద్వేగం

డెహ్రాడూన్ జూన్20 (నిఘా న్యూస్)

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వేదికపైనే భావోద్వేగానికి గురై కంట తడి పెట్టారు. రాష్ట్రపతి తన 67వ పుట్టినరోజు సందర్భంగా డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు అంధ విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గీతాలు ఆలపించారు. ఈ క్రమంలోనే ద్రౌపది ముర్ము భావోద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఉత్తరాఖండ్‌లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ డిసేబిలిటీ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు ఎంతో అందంగా పాడుతుంటే భావోద్వేగానికి గురయ్యారని చెప్పారు. 'కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట' అని అన్నారు. పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్లే ఒకనాటి నిశ్చయంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. వైకల్యంతో పుట్టిన పిల్లల సాధికారత కోసం పని చేస్తున్న ఎన్ఐఈపీవీడీని అభినందించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (రిటైర్డ్), ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## 60 యుద్ధ విమానాలతో
# ఇరాన్‌లో నిప్పుల వర్షం

మొదటి పేజీ తరువాయి...

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శుక్రవారం రాత్రి భీకర వైమానిక దాడులకు పాల్పడింది. 60 యుద్ధ విమానాలతో ఇరాన్ లోని లక్ష్యాలపై నిప్పులు చెరిగింది. ముఖ్యంగా, ఇరాన్ అణు కార్యక్రమంతో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఫెన్సివ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ (ఎస్పీఎన్‌డీ) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో దాదాపు 639 మంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం. ఇరు దేశాల మధ్య ఈ ఘర్షణ వాతావరణం రెండో వారంలోకి ప్రవేశించింది. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ మొదటి నుంచి వాదిస్తోంది. అయితే, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఇరాన్ పునరుద్ఘాటిస్తోంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో, యూరోపియన్ దేశాలు దౌత్య మార్గాల ద్వారా ఇరాన్‌ను శాంతియుత చర్చలకు తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ విషయంలో తమ దేశం జోక్యంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకుంటామని సంకేతాలిచ్చారు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) వెల్లడించిన వివరాల ప్రకారం, 60కి పైగా యుద్ధ విమానాలు, సుమారు 120 శక్తివంతమైన ఆయుధాలతో ఈ దాడులు జరిగాయి. టెహ్రాన్ పరిసర ప్రాంతాల్లోని పలు క్షిపణి తయారీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నారు. వీటిని ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కీలక పారిశ్రామిక ప్రాంతాలుగా ఐడీఎఫ్ అభివర్ణించింది. క్షిపణి విడిభాగాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడులు కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయ భవనాన్ని ఈ ఆపరేషన్‌లో విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

"క్షిపణి విడిభాగాల ఉత్పత్తికి సంబంధించిన సైనిక పారిశ్రామిక ప్రాంతాలు, రాకెట్ ఇంజన్ల తయారీకి వాడే ముడిపదార్థాల ఉత్పత్తి కేంద్రాలపై దాడి చేశాం. ఇరాన్ అణ్వాయుధ ప్రాజెక్టును దెబ్బతీసే చర్యల్లో భాగంగా, టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ ప్రధాన కార్యాలయ భవనంపై కూడా దాడి చేయడం జరిగింది" అని ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది.ఎస్పీఎన్‌డీ సంస్థ ఇరాన్ సైనిక సామర్థ్యానికి అవసరమైన అధునాతన సాంకేతికతలు, ఆయుధాల పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమ రూపశిల్పిగా పేరుగాంచిన ఫఖ్రి జాదే 2011లో ఈ సంస్థను స్థాపించారు. తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింతగా ముసురుకుంది.

# ఇంగ్లీష్ అంటేే ఒక పవర్

న్యూఢిల్లీ జూన్ 20(నిఘా న్యూస్)

ఇంగ్లీష్ మాట్లాడే వాళ్లు త్వరలోనే సిగ్గుపడాల్సి వస్తుందని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం తప్పుపట్టారు. దేశంలోని పేద పిల్లలను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని అన్నారు. 'ఇంగ్లీష్ అనేది డ్యామ్ కాదు, ఒక బ్రిడ్జి. ఇంగ్లీష్ అంటే సిగ్గు కాదు, పవర్. ఇంగ్లీషు అనేది ఒక చైన్ కాదు, చైన్‌లను బ్రేక్ చేసే పరికరం. ఇండియాలోని పేద పిల్లలు ఇంగ్లీష్ చదువుకోవడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదు. వాళ్లను ప్రశ్నించేవారు ఉండకూడదని వారు కోరుకుంటున్నారు. తమతో సమానంగా ఎదగడం కూడా వారికి ఇష్టం లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీష్ మాట్లాడవద్దని,హిందీలో మాట్లాడమని చెబుతుంటారని, అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలోని పిల్లల మాత్రం ఇంగ్లీషు విద్యకు వెళ్తుంటారని, దీని వెనుక కారణమేమిటని రాహుల్ ప్రశ్నించారు. ఎందుకంటే పేద పిల్లలు బోర్డ్ రూముల్లోకి ఎంటర్ కారాదని, అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు రాకూడదని వారు కోరుకుంటున్నారని అన్నారు. వాళ్లు ఇంగ్లీషు స్కూళ్లకు వెళ్లి కాంటాక్టులు పెంచుకుంటారని, పేద పిల్లలకు మాత్రం తలుపులు మూసేస్తారని ఆక్షేపణ తెలిపారు. సాధికారతకు మాతృభాషతో పాటు ఇంగ్లీష్ చాలా అవసరమని, ఇంగ్లీష్ విద్య విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని, ఉపాధిని కల్పిస్తుందని రాహుల్ అన్నారు. దేశంలోని ప్రతి భాష ఆత్మవంటిదని, సంస్కృతి, నాలెడ్జికి ప్రతీక అని అన్నారు. భాషాభివృద్ధి జరగాలని, అదే సమయంలో ప్రతి ఒక్క పిల్లవాడికి ఇంగ్లీష్ బోధించాలని అన్నారు. అప్పుడే ప్రపంచంతో భారత్ పోటీ పడగలుగుతుందని, ప్రతి ఒక్క పిల్లవాడు సమానావకాశాలు పొందగలడని రాహుల్ స్పష్టం చేశారు. తన ఎక్స్ అకౌంట్‌లో హిందీ భాషలో రాహుల్ గాంధీ ఈ పోస్టు చేశారు. ప్రతి భారతీయ భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని ఆదరించాలని, అదే సమయంలో ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పాలన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే ఇండియాకు ఇదో మార్గమని, ఇది ప్రతి పిల్లవాడికి సమాన అవకాశం కల్పిస్తుందన్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ సరిహద్దులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దీనితో కారులోని 9 మంది యువకులు మృతి చెందారు. బెంగాల్ జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లి, తిరిగి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది.

'పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లాలోని అడబానా గ్రామంలో ఓ వివాహ వేడుక జరిగింది. ఆ పెళ్లికి ఝార్ఖండ్‌లోని నిమ్డిహ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిలైటాండ్ గ్రామానికి చెందిన పలువురు వెళ్లారు. వాళ్లు శుక్రవారం తిరిగి వస్తుండగా నామ్షోల్ గ్రామ సమీపంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. దీనితో బొలెరో యజమాని సహా అందులోని వారంతా మరణించారు. అయితే మృతులందరూ ఒకే గ్రామానికి చెందిన యువకులు కావడంతో, అక్కడ విషాధ ఛాయలు అలుముకున్నాయి. స్థానిక పోలీసుల సాయంతో పోస్ట్ మార్టం తరువాత, మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగిస్తాం' అని నీమ్‌దీహ్ పోలీస్ స్టేషన్ ఇన్ ఛార్జ్ శాంతన్ తివారీ తెలిపారు.

### బెంగాల్ భారీగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు!

బెంగాల్, హౌరాలోని బగ్నాన్‌లో గురువారం ఓ ప్రయాణికుల బస్సును, ట్రక్కు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, దాదాపు 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రభుత్వంపై బీజేపీ నాయకుడు సువేందు అధికారి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రోడ్డు భద్రతా ప్రమాణాలు అడుగంటాయని విమర్శించారు. బెంగాల్ పెరుగుతున్న ప్రాణాంతక ప్రమాదాలకు- మౌలిక రోడ్డు రవాణా సదుపాయాలు కల్పించకపోవడం సహా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత నిబంధనల అమలులోని వ్యవస్థాగత వైఫల్యాలే కారణమని ఆయన అన్నారు. కనుక ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఒత్తిడిని జయించేందుకు...
# యోగాను ఆచరిద్దాం

మొదటి పేజీ తరువాయి...

వాడవాడలా యోగా సాధనతో సరికొత్త రికార్డు సృష్టిద్దాం. వారసత్వంగా వచ్చిన యోగాను మనమంతా ఆచరించటంతో పాటు భవిష్యత్ తరాలకూ అందిద్దాం' అని అన్నారు.

**యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం: సీఎం చంద్రబాబు**

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 21 జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు ప్రజలకు పిలుపునిచ్చారు. విశాఖపట్నం ఆర్కే బీచ్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా యోగా సాధనలో సరికొత్త రికార్డు సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు.

**యోగా - మన సంస్కృతి, మన ఆరోగ్యం**

యోగా మన ప్రాచీన సంస్కృతిలో భాగమని, అది మనకు లభించిన అమూల్యమైన సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శారీరక, మానసిక ఒత్తిళ్లను తగ్గించడంలో యోగా పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. "యోగాను నిత్యం ఆచరిద్దాం. మన జీవన విధానంలో అంతర్భాగంగా మార్చుకుందాం. విశాఖ వేదికగా జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నుంచే దీనికి నాంది పలుకుదాం" అని ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి అన్నారు. యోగా సాధన ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

"ప్రధాని నరేంద్ర మోదీ గారి సమక్షంలో విశాఖ ఆర్కే బీచ్ లో జరుగనున్న యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం. అలాగే రాష్ట్రంలో వాడవాడలా యోగా సాధనతో సరికొత్త రికార్డు సృష్టిద్దాం" అని ఆయన దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు. వారసత్వంగా మనకు అందిన ఈ యోగా విద్యను మనమంతా ఆచరించడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## పేదలకు
# మరో మూడు కోట్ల ఇళ్లు

మొదటి పేజీ తరువాయి...

మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్‌లో తాజాగా మరోసారి పర్యటించిన మోదీ కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై నిప్పులు చెరిగారు. బిహార్‌ను 'లైసెన్స్ రాజ్' సుదీర్ఘ కాలం పేదరికంలోనే ఉంచిందని, ఇందులో దళితులే అతిపెద్ద బాధితులుగా మారారని ఆరోపించారు. రాష్ట్రంలోని సివాన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు.ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు. పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. 'బిహార్‌ను ఎన్డీయే అభివృద్ధి చేస్తుందనడానికి మర్హౌరా రైలు ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ. ఇప్పుడు ఆఫ్రికాలోనూ బిహార్‌కు ప్రశంసలు వస్తాయి. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పట్టించుకోని సరన్ జిల్లాలోనే ఈ రైల్వే ప్రాజెక్టు కొనసాగుతోంది. తయారీ, ఎగుమతుల్లో ఈ జిల్లా ఇప్పుడు ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకుంది. బిహార్ అభివృద్ధిని సుదీర్ఘకాలంగా 'జంగిల్ రాజ్' అడ్డుకుంది. కానీ, ఇప్పుడు బిహార్‌లో తయారైన ఇంజిన్ ఆఫ్రికన్ రైలుకు శక్తినిస్తుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని మా ప్రభుత్వం చెబుతుంటే.. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం 'పరివార్ కా సాత్' అంటూ వారి కుటుంబ శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికానికి కాంగ్రెస్ 'లైసెన్స్ రాజ్' కారణమన్నారు. నేతల కుటుంబీకులు ధనవంతులు కాగా.. సామాన్యులు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. రానున్న రోజుల్లో మూడు కోట్ల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రజాసేవ చేయకుంటే తాను ప్రశాంతంగా నిద్రపోలేనని, రాత్రి-పగలు ప్రజల కోసమే పని చేస్తానని వ్యాఖ్యానించారు. బీహార్ స్వాతంత్య్ర సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ కింద 6,600 మంది లబ్దిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై-యూ లబ్దిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేంద్ర సహకారం లేకుండా... అభివృద్ధి పనులు జరగవు

మొదటి పేజీ తరువాయి...

దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు చెప్పాలని వివరించారు. రాష్ట్రాన్ని రక్షించాలంటే బీజేపీ ప్రభుత్వం రావాలని స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వల్ల రాష్ట్రం అప్పుల పాలు అవుతుందని అన్నారు. ప్రజలకు విశ్వాసం కల్పించి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. రాష్ట్రంలో కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోతే అభివృద్ధి కార్యక్రమాలు జరగవని స్పష్టం చేశారు. కేంద్రం సాయంతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు విశ్వాసంతో స్థానిక సంస్థల ఎన్నికల్లోకి వెళ్లాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశం కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో స్థానిక సంస్థల ఎన్నికలు, తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. పార్టీ పటిష్ఠానికి తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఇన్‌ఛార్జులు సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ హాజరు అయ్యారు. ఎంపీలు ఈటల రాజేందర్, గోడెం నగేశ్, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్ బాబు, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పాయల్ శంకర్ హాజరయ్యారు.

## అసాంఘిక శక్తులకు మద్దతుగా
# మాట్లాడడం కూడా నేరమే

మొదటి పేజీ తరువాయి...



రాష్ట్రంలో అప్రజాస్వామికంగా వ్యవహరించేవారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అటువంటి వారిని ప్రజలు నిశితంగా గమనించాలని, అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ సినిమా డైలాగులతో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ కల్యాణ్ గురువారం మీడియా ద్వారా స్పందించారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలను కట్టడి చేయకపోగా, వాటిని సమర్థించేలా మాట్లాడే వారి నేరపూరిత ఆలోచనలను ప్రజలు గమనించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమేనన్న విషయాన్ని ఎవరూ మరచిపోరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సినిమాల్లో చెప్పే డైలాగులు సినిమా హాళ్ల వరకే బాగుంటాయని, వాటిని నిజ జీవితంలో అమలుచేస్తామంటే ప్రజాస్వామ్యంలో కుదరదని ఆయన హితవు పలికారు. చట్టం, నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, అవసరమైతే రౌడీషీట్లు తెరిచి అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# శ్రీకాళహస్తిలో జనసేన సంబరాలు

**శ్రీకాళహస్తి, జూన్ 20 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసేన కార్యకర్తలు, వీర మహిళల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కొట్టె సాయి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ చెయ్యని విధంగా 9.6 కోట్ల రూపాయల కష్టార్జితాన్ని ప్రజల కోసం ఇచ్చిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని, తాను ఎంచుకున్న పంచాయతీ రాజ్ శాఖకు న్యాయం చేస్తూ కేంద్రం నుండీ వచ్చే నిధులు నేరుగా పంచాయితీలకు అందించి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్నారు అన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులు పక్కదారి పట్టించే పరిస్థితి ప్రజలందరూ గమనించారని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఏ పార్టీ సర్పంచ్ లు ఉన్నా ప్రతి పంచాయతీకి సమానంగా నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి దోహదం చేస్తూనే సర్పంచ్, ఎంపీటీసి లను తలెత్తుకునేలా చేసిన ఘనత పవన్ కళ్యాణ్ ది అన్నారు. అటవీశాఖ మంత్రిగా ఎవరూ చూపనంత చొరవ చూపి ఆంధ్ర రాష్ట్రంలో పలుచోట్ల ఏనుగుల వలన ప్రజలకు ప్రాణనష్టం, ఆస్తి నష్టం కలుగజేస్తున్న సందర్భంగా కర్ణాటక రాష్ట్రాన్ని ఒప్పించి కుంకి ఏనుగులు మన రాష్ట్రానికి తెచ్చిన ఘనత పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. జనసేన పార్టీ నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించి భారత దేశ చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించిందన్నారు. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి గా సంబంధిత శాఖలకు వన్నె తెచ్చేలా పరిపాలన అందించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు.



ఈ కార్యక్రమంలో గరికపాటి చంద్రశేఖర్, ఇర్ల చిరంజీవి,ఢిల్లీ బాబు, బద్రి, పగడాల ప్రతాప్, అరిగెల వేణు, వీర మహిళ కవిత, పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, మహేష్, ముని చంద్ర, ముని కుమార్, రమేష్ బాబు, వెంకటేష్ ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.



బాగ్ అంబర్ పేట్ వైభవ్ నగర్‌లో పార్క్ ఆధునీకరణ పనులను అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ పద్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరిత గతిన పార్క్ ఆధునికరణ పనులను పూర్తి చేసి ప్రజలకి అందుబాటు లోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు వెంకట రెడ్డి, వైభవ్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, జూన్ 20 (నిఘా న్యూస్):




బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు కోలాహలంగా నిర్వహించారు. ప్రజా సంక్షేమం కోరే ప్రజా సేవకుడు, నిరంతర శ్రామికుడు, ప్రజల కోసం, ప్రగతి కోసం, నిరంతరం కృషి చేస్తున్న ఏకైక ప్రజానాయకుడు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో తితిదే పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి, జూన్ 20(నిఘా న్యూస్):

## బీరప్ప గడ్డలో పర్యటించిన ఎమ్మెల్యే



**ఉప్పల్, జూన్ 20 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిలుకానగర్ కార్పొరేటర్ గీత శుక్రవారం బీరప్ప గడ్డ ప్రాంతంలో పర్యటించి స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బీరప్ప గడ్డ ప్రాంతంలో డ్రైనేజీ, రోడ్ల పరిస్థితి గురించి స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ రోడ్ల సమస్యలను పరిష్కరించాలని స్థానిక నేతలు మహిళలు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి నేర్ధం భాస్కర్ గౌడ్, కోలా రవికుమార్ గౌడ్, పల్లె రాజ్ కుమార్, కిషన్, దయానంద్, బిక్కు స్థానిక మహిళ నాయకురాళ్లు, టిఆర్ఎస్ నాయకులు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## ఇల్లందులపాడులో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



**మధిర, జూన్ 20 (నిఘా న్యూస్):** మధిర మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మున్సిపాలిటీ పరిధి నాలుగవ అవార్డు ఇల్లెందులపాడులో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం జరిగింది.డిప్యూటీ సీఎం మల్లు విక్రమార్క ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సూచనలతో పారిశుద్ధ్య నిర్వహణ పరమైన పనులు,మురికి కాలువలు,కాలవల్లో పూడిక, పిచ్చి మొక్కలను తొలగించారు.ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా పారిశుధ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టి వార్డులో పేరుకు పోయిన చేత,కాలవల్లో పూడిక,పిచ్చి మొక్కలు తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టటం,ప్రభుత్వ పనితీరు బేస్ అన్నారు.వర్షాకాలం కావడంతో పరిసరాలు శుభ్రంగా లేకపోతే అంటువ్యాధులు సైతం ప్రబలే అవకాశాలు ఉన్నాయి. అందుచేత ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు స్వామినేని రామనాథం, కాంగ్రెస్ నాయకులు కోట డేవిడ్, కె.మురళి తదితరులు పాల్గొన్నారు.

## చిలుకా నగర్‌లో కోటి వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత



**చిలుకానగర్, జూన్ 20 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ లోని న్యూ రాంనగర్ కాలనీలో బీరప్ప గడ్డ, ప్రశాంత్ నగర్ కాలనీలో సుమారు 80 లక్షల రూపాయలతో స్టార్మ్ వాటర్ డ్రీమ్ పైప్లైన్ పనులకు, కావేరి నగర్ కల్వర్టు వద్ద చిల్కానగర్ ఉప్పల్ ప్రధాన రహదారి లో 16.5 లక్షల రూపాయల వ్యయంతో బాక్స్ డ్రైన్ పనులకు, కావేరి నగర్ కల్వర్టు వద్ద ఇరువైపులా చైన్ లింకు, ఫెన్సింగ్ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ గీత, టిఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని, డివిజన్‌ను ఒక ప్రణాళిక అబద్ధంగా సీవరేజ్ పైప్ లైన్లు, స్టార్మ్ వాటర్ డ్రీమ్ పైప్ లైన్లు, బాక్స్ డ్రైన్ లతో, మంచినీళ్ల పైపులైన్లు వేసిన అనంతరం సిసి రోడ్లతో అన్ని ప్రాంతాలను అటు బస్తీలు, కాలనీలను సమానంగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. చిల్కానగర్ డివిజన్ ని నియోజకవర్గం లోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఈ. ఈ. హరి లాల్, డి ఈ. వినీల్ గౌడ్ , ఏ ఈ. రాధిక వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిర్ఎస్ సభ్యులు, కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బస్తీవాసులు పాల్గొన్నారు.

## షూటింగ్ బాల్ క్రీడాకారులను ప్రోత్సహించాలి

### జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జి .సురేంద్ర



**కర్నూలు, జూన్20 (నిఘా న్యూస్):** అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నగరంలోని విఠల్ నగర్ లో ఉన్న గుడ్ షెఫర్డ్ క్రీడా మైదానంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్ పోటీలకు ముఖ్య అతిథిగా కర్నూలు జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు జి . సురేంద్ర ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం క్రీడాకారుల ఉద్దేశించి ప్రసంగిస్తూ చిన్నప్పటి నుంచి క్రీడల సాధన చేయడం అలవాటు చేసుకోవాలని వ్యాయామం తప్పనిసరిగా మన జీవితంలో చర్య కావాలని తెలిపారు. అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నేరుగా ఉద్యోగాలు కల్పించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. దాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఆదివారం కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు జరిగే ఒలంపిక్ డే ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు , అథ్లెటిక్ అసోసియేషన్ ప్రతినిధి హర్షవర్ధన్ , పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ , గుడ్ షెఫర్డ్ విద్యాసంస్థల అధినేత మిన్నెల , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు , ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు చిన్న సుంకన్న , జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు సుభాన్ భాష, మధుసూదన్ , రమ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంతో వ్యాధుల నివారణ

### మండల వైద్యాధికారి డా.ప్రవళిక




**పెబ్బేరు, జూన్ 20 (నిఘా న్యూస్):** వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డా.ప్రవళిక అన్నారు. శుక్రవారం డ్రై డేను పురస్కరించుకుని మండల వైద్యాధికారి డా.ప్రవళిక పెబ్బేరు మున్సిపాలిటీ లోని నాలుగో వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగు కాలువలు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. మురుగు కాలువల్లో నీరు ప్రవహించేలా చెత్త లేకుండా చూసుకోవాలని తెలిపారు.కాలనీ ప్రజలతో మాట్లాడారు.ప్రజలు ఇంటి ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లు, మురుగు కాలువలలో చెత్త వేయవద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని, ఇళ్లలో ఉన్న పూలతొట్లు, కూలర్లు, టైర్లు, కొబ్బరిబోండాలలో నీరు నిలువలేకుండా ఖాళీ చేయాలన్నారు.లేదంటే అందులో దోమలు ప్రబలి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేని పాటించి ఇంటి ఆవరణలో నీటి నిలువలను తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్,ఏఎన్ఎం జయశ్రీ, వార్డు ఆఫీసర్ రుక్మిణి, మున్సిపల్ సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను హరిస్తున్న మోదీ ప్రభుత్వం

### సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు




**పెబ్బేరు, జూన్ 20 (నిఘా న్యూస్):** కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కార్పొరేటర్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తున్నాడని ఆశా కార్యకర్తలు, సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు తెలిపారు. ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు పెబ్బేరు ప్రాథమిక వైద్యాధికారి డా.ప్రవళికకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ దోపిడీదార్లకు కొమ్ము కాసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను, హక్కులను కాలరాస్తూ కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. పోరాడి ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న హక్కులు, చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జూలై 9 న జరిగే జాతీయ స్థాయి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ గా విభజించి 8 గంటల పని దినాలను 12 గంటల పని దినాలకు పెంచేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. అనంతరం సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్, చెన్నమ్మ, నస్రిన్, సరళ, సుల్తానా, గోవిందమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ఫతేనగర్, హైదరాబాద్ కు చెందిన వి ఎస్ వి రమణ గురుస్వామి 150వ సారి శబరిమల యాత్రలో అయ్యప్ప స్వామి వారి దర్శనం పూర్తిచేసుకున్నారు. వి స్వి రమణ గురుస్వామి 1990లో మొదటిసారి అయ్యప్ప మాలధారణ చేయడం కన్నె స్వామిగా, ప్రతి మాసం యాత్ర చేయడంతో వారి ప్రయాణంలో 150వ సారి శబరిమల వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం వారి శిష్యులుగా ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

– కూకట్‌పల్లి జూన్ 20 (నిఘా న్యూస్):

## యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



**హుజురాబాద్, జూన్ 20,(నిఘా న్యూస్):** యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, బిజెపి పట్టణ శక్తి కేంద్ర ఇన్చార్జ్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా హుజరాబాద్ పట్టణ పరిధిలోని ఇప్పల నర్సింగాపూర్‌లో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ భారత్, సేవ సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రతి సవాల్ని ధైర్యంగా ఎదుర్కొని ప్రపంచంలో అణిచిత పరిస్థితుల్లో ఉన్నప్పటికీ భారత్ ప్రధాని మోడీ నాయకత్వంలో అభివృద్ధి చెందుతుందని, ఆర్థిక శక్తిగా ఎదుగు తుందన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఆకాష్ బ్రహ్మోస్ ను భారత్ జవాన్లు సమర్ధవంతరంగా ఉపయోగించిందన్నారు. ఎగుమతులు 34 రెట్లు పెరిగాయి అన్నారు. దేశ మొత్తం వికసిద్భారత్ లక్ష్యాన్ని చేరుకునే దిశగా భారత్ మోడీ నాయకత్వంలో ముందుకెళుతుందన్నారు. 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లె వీరయ్య, బొడ్డు మహేష్, తిప్పబత్తిని రాజు, మల్లారెడ్డి, శృతి, ఐలయ్య, మొగిలి, రాజిరెడ్డి,చంద్రమౌళి, గోస్కుల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద పాపయ్యపల్లిలో వర్షాలు కురవాలని కప్ప తల్లికి పూజలు



**హుజురాబాద్, జూన్ 20(నిఘా న్యూస్):** హుజరాబాద్ మండలం పెద్ద పాపయ్య పల్లి గ్రామంలో వర్షాలు కురవాలని శుక్రవారం రైతులు కప్ప తల్లి ఆడారు. రోకలి బండను అలంకరించి మధ్యలో కప్పను కట్టి డప్పు సప్పులతో గ్రామంలో ఇంటింటికి వెళ్లారు. అధిక సంఖ్యలో మహిళలు కప్పపై నీళ్లు పోస్తూ సాంప్రదాయ పద్ధతిగా మొక్కులు తీర్చుకున్నారు. సమృద్ధిగా వర్షాలు వర్షాలు కురిసి పంటలు పండాలని వరుణ దేవుణ్ణి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, మహిళలు ఉన్నారు.

## ఈ నెల 27న... యాదగిరిగుట్ట భద్రకాళి ఆలయానికి ప్రత్యేక బస్సు

### డిపో మేనేజర్ రవీంద్రనాథ్




**హుజురాబాద్, జూన్ 20 (నిఘా న్యూస్):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఆర్టీసీ నుండి యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, భద్రకాళి ఆలయం కు ఈనెల 27న సూపర్ లగ్జరీ బస్సులు నడప నున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ శుక్రవారం డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుజురాబాద్ బస్టాండ్ నుండి ఉదయం 4 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు హుజురాబాద్ కి చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు చార్జీలు పెద్దలకు వేయి, పిల్లలకు 600 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. దైవదర్శనానికి వెళ్లే ప్రయాణికులకు అల్పాహారం, వాటర్ సదుపాయం ఆర్టీసీ కల్పించినట్లు తెలిపారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**హబ్సిగూడ, జూన్ 20 (నిఘా న్యూస్):** హబ్సిగూడ డివిజన్‌లో జిల్లా పరిషత్ హై స్కూల్లో మధుర చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చేయూత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు, ప్రధమ శ్రేణి, ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి, బ్యాచ్ లను, ప్లేట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెట్రో వాకర్స్ సభ్యులకు యోగా శిక్షణ

### హోమియోపతి కళాశాల ప్రిన్సిపల్ ఆయుష్ అడిషనల్ డైరెక్టర్ డా.లింగరాజు



**ఉప్పల్, జూన్ 20(నిఘా న్యూస్):** హోమియోపతి కళాశాల ప్రిన్సిపల్, ఆయుష్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ లింగ రాజు ఆధ్వర్యంలో డాక్టర్ గీత శిక్షణలో ఉప్పల్ భగాయత్ లో భగాయత్ మెట్రో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మన నిత్యజీవితంలో యోగ ముఖ్య భూమిక పోషిస్తుందని, మానసిక ప్రశాంతతకు, శారీరిక ఆరోగ్యానికి యోగ తోడ్పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తోడ్పడిన డాక్టర్ లింగరాజు, డాక్టర్ గీత వారి సిబ్బందికి అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. యోగ కార్యక్రమంలో మేకల మధుసూదన్ రెడ్డి, జెట్టా సుధాకర్, వాకిటి బుచ్చిరెడ్డి, బజారు పాండుగౌడ్, వెంకటయ్య గౌడ్, నర్సిరెడ్డి, శ్రీనివాస్, మేకల భాస్కర్ రెడ్డి, షామీర్పేట్ యాది రెడ్డి, నాగార్జున రెడ్డి, చంద్రయ్య, రాజవర్ధన్ గుప్తా లింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రకాష్, విద్యాసాగర్ రెడ్డి, మేకల రామిరెడ్డి, శేరి నర్సింహా రెడ్డి లింగారెడ్డి రామయ్య జీవన్ రెడ్డి కట్ట జనార్ధన్ రెడ్డి పోచయ్య ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై మురికినీటి తిష్ట



**నారాయణపేట, జూన్ 20 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల కేంద్రంలోని పెద్దపోర్ల నుండి చిన్న పోర్ల కు నడచిపోయే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ప్రధాన రహదారిపై వర్షపు నీరు మురుగునీరు రహదారిపై నిలవడంతో పెద్దపోర్ల నుండి చిన్న పోర్ల పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ప్రజలకు మురుగు నీరులో నుంచి నడవవలసిన దుస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తపరిచారు. వెంటనే సంబంధిత అధికారులు వీలైనంత త్వరలో మరమ్మతులు చేయించి ప్రజలకు సహకరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు.

## సింగరేణి గ్రౌండ్‌లో నేడు పొంగులేటి సభ

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లందు, జూన్ 20 (నిఘా న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు సింగరేణి స్కూల్ గ్రౌండ్ నందు నిర్వహించనున్న భారీ బహిరంగ సభ స్థలాన్ని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య పరిశీలించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భారీ బహిరంగ సభకు హాజరు కానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లపై చర్చించారు. సభ ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధికారులకు, పార్టీ నేతలకు సూచించారు. ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రబాను, ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణ, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, డి.శివకుమార్, చిల్లా శ్రీనివాస్, చెన్నూరి కృష్ణ, ఎర్రసంగి ఎంకన్న, సైదామియా తదితరులు పాల్గొన్నారు.

## తడి పొడి చెత్తపై అవగాహన

**ఇల్లందు, జూన్ 20 (నిఘా న్యూస్):** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోనే 16వ వార్డు నందు తడి పొడి చెత్త కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ లాల్య, వార్డ్ ఆఫీసర్ గిరీష మాట్లాడుతూ చెత్తను తడి, పొడిగా వేరుచేసి చెత్త సేకరణ వాహనాలకు అందించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా 16వ వార్డు నందు పారిశుద్ధ అధికారులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడివాడ వీరభద్రం, 16వ వార్డ్ ఇంచార్జ్ ఉలింగ సతీష్, లింగంపల్లి శ్రీనివాస్,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### సాంస్కృతిక పోరాటం ద్వారా

# సమాజ మార్పునకు కృషి

### టీపిఎస్‌కె మండల నూతన కార్యవర్గం ఎన్నిక



**ఇల్లందు, జూన్20 (నిఘా న్యూస్):** సమాజంలో వివిధ రకాల ఆధిపత్య భావజాలం ద్వారా సమాజంపై దాడి జరుగుతుందని ఈ నేపథ్యంలో ప్రత్యన్మాయ సాంస్కృతిక పోరాటం అవశ్యకత ఏర్పడిందని సాంస్కృతిక రంగంలో పోరాటం నిర్వహించడం ద్వారా సమాజ మార్పుకు కృషి చేయాలనీ తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టిపిఎస్‌కె) ఇల్లందు మండల నాయకులు మన్నెం మోహన్ రావు పిలుపునిచ్చారు. ఇల్లందు ఏలూరి భవన్ లో టి పి ఎస్ కె సభ ఆర్ బి జె రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆధిపత్య భావజాలని నిరంతరం పెంచి పోషించే వ్యవస్థలను ఎదుర్కోవడం ప్రతి ఒక్కరి భాధ్యత అని అన్నారు. సమాజంలో నేడు వ్యక్తి వాదం, వినిమయ వాదం, మనవ సంబంధలతో సహా సర్వం సరకుగా మారుతుందని, కులం, మతం, భాష, సాహిత్యం కళలు, ఆచారాలు, అలవాట్లు, కట్టుబాట్లు, సాంప్రదాయలపై ఆధిపత్య భావజాలం దాడి జరుగుతుందని దానిని ఎండగట్టలని పిలుపునిచ్చారు. ప్రజల అభివృద్ధికి, ఐక్యతకు, స్వేచ్చకు, మానవ నాగరికతకు సవాల్ గా నిలిచిన సామాజిక, సాంస్కృతిక రుగ్మతల నిర్మూలనకు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నిర్వహిస్తుందని ప్రతి ఒక్కరు దీనిలో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం టిపిఎస్ కె నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వజ్జా సురేష్, మన్నెం మోహన్ రావు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఇల్లందు మండల నూతన కమిటీని 19 మందితో ఎన్నిక చేయడం జరిగింది. నూతన అధ్యక్షులుగా వజ్జా సురేష్, కార్యదర్శిగా మన్నెం మోహన్ రావు ఉపాధ్యక్షులుగా ఆర్ బి జె రాజు, వైకుంఠం, మరియా సహాయ కార్యదర్శులుగా జలాల్, చిన్ని,లీల మణితో పాటు మరో 11 మందిని నూతన కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సభను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆలేటి కిరణ్, ట్రేడ్ యూనియన్ నాయకులు కృష్ణ లు మాట్లాడారు. ఈ సభలో పద్మ, సంతోష, తాండ్ర కాంతమ్మ, వీరయ్య,వీరభద్రం, భిక్షం, శంకర్, సత్యనారాయణ కోరి, లక్ష్మి నారాయణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభిమానులకే ఇందిరమ్మ ఇండ్లు

### మహేశ్వరం బిఆర్ఎస్ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి



**మహేశ్వరం, జూన్ 29(నిఘా న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఈ జాబితాను రూపొందించడంలో ఆంతర్యం ఏమిటని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ సామ మహేందర్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇల్లు లేని వారికి, కిరాయి గృహాల్లో ఉన్నవారికి కాకుండా ఇందిరమ్మ కమిటీల పేరుతో నియోజకవర్గం వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్నవారికి ఇల్లు మంజూరు చేస్తున్నారని అర్హులైన లబ్ధిదారులను పక్కన పెడుతున్నారని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కి మండలంలో కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తారని సోషల్ మీడియా గ్రూపులలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే పోస్టులు పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాస్ మంజూరు చేయాలని. ఇళ్ల ఎంపికలో అధికారులను బలిపశువు చేయకుండా పూర్తి పారిదర్శకతను పాటించాలని డిమాండ్ చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో పలు గ్రామ పంచాయతీలలో ముగ్గు పోసిన ఇంటికి రాకుండా అడ్డుకుంటున్నారు అని, 400 చదరపు అడుగుల నుండి 600 చదరపు అడుగుల వరకు ఉన్న నిబంధనను తొలగించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నిజమైన అర్హులకు ఇల్లు మంజూరు చేయకపోతే ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ముగిసిన భూ భారతి రెవెన్యూ సదస్సులు

### 15రోజులుగా ఊరురా కొనసాగిన రెవెన్యూ సదస్సులు



**సిద్దిపేట, జూన్ 20 (నిఘా న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల తాసిల్దార్ ఎర్రోళ్ల శ్యామ్ అన్నారు. ఈ నెల మూడవ తేది నుండి ప్రారంభించిన రెవిన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిసినట్లు తెలిపారు. అక్కడక్కడా చిన్న చిన్న చెదురు మదురు సంఘటనలు సహజంగానే జరిగాయి తప్ప మరేమిలేదన్నారు. పదిహేను రోజులుగా కొనసాగిన రెవిన్యూ సదస్సులకు ఆయా గ్రామాల్లో పార్టీలకతీతంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు అందగానిలిచి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి తీసుకున్న వినతిపత్రాలను ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ ఇలా అన్నారు, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సుమారు ఇప్పటి వరకు 878 వినతి పత్రాలు వచ్చాయని తెలిపారు. శుక్రవారం చివరి రోజు కావడంతో రెండు బృందాలుగా ఏర్పడి వెలికట్ట, తిమ్మారెడ్డి పల్లి గ్రామాలల్లో నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం ఈ నెల 21నుంచి రైతుల వద్ద తీసుకున్న వినతిపత్రాల పరిశీలనను కొనసాగిస్తూ, రైతు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశానుసారం రైతు పొలం వద్దకు ఒక బృందంగా వెల్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు.

## పేదల ఆశలు నెరవేర్చిన రెవంత్ సర్కార్

### బోమ్మలపల్లి నర్సింహులు యాదవ్



**శామీర్‌పేట, జూన్ 20 (నిఘా న్యూస్):** ముడుచింతలపల్లి మున్సిపాలిటి పరిధిలో నారాయణపూర్ గ్రామంలో 8 ఇళ్లకు శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ హజారైనారు. అదే విధంగా మాజీ ఎంపిపి మంద శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి అఖిలేష్ రెడ్డి, బండి జగన్నాథం, దామోదర్ రెడ్డి, హరిమోహన్ రెడ్డి, గుర్రం బస్వరెడ్డి, దోసకాయల వెంకటేష్, రాత్నల మహేష్, కీసరి బాను చందర్, సంజీవ, నరసింహ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు ఘన సన్మానం



**హుజురాబాద్, జూన్ 20 (నిఘా న్యూస్):** హుజురాబాద్ పట్టణంలోని స్థానిక న్యూ కాకతీయ ఉన్నత పాఠశాలలో గ్లోబల్ షో టో ఖాన్ కరాటే డు అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో బెల్ట్ మెరిట్ టెస్టులో విజయం సాధించిన కరాటే విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఇట్టి సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ కరాటేను తన వృత్తిగా ఎంచుకొని, తోటి కరాటే మాస్టర్స్ కు ఆదర్శంగా ఉంటూ, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దుతు, వారి భవిష్యత్తుకు పునాది వేస్తున్న కరాటే శ్రమజీవి మాస్టర్ ఎస్కే జలీల్ ను అభినందించి నారు. కరాటే విద్యార్థుల శారీరక అభివృద్ధితో పాటు, వారు మానసికంగా ఎదుగుటకు అదే విధంగా కరాటే పిల్లలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు, సమాజంలోని ఏ సమస్యనైనా ఎదుర్కొనుటకు తోడ్పడుతుందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ధైర్యంగా ముందడుగు వేస్తూ తమను తాము రక్షించుకోవడంతోపాటు, తోటి ఆడ పిల్లలను కాపాడడానికి వారిలో ధైర్యాన్ని పెంపొందిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తపరచారు. కార్యక్రమంలో రిటైర్డ్ పిఈటి సొల్లు సారయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు కొలిపాక సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు ఉప్పు శ్రీనివాస్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు ఖలీద్ హుస్సేన్, ఆకుల సదానందం, బత్తుల రాజకుమార్, టి.గోపాల్, దాసరి మల్లేశం, ఎండి సల్మాన్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్ శుక్రవారం బిల్ కలెక్టర్లతో ప్రాపర్టీ టాక్స్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, చెక్ బోన్స్ కేసులు, ట్రేడ్ లైసెన్స్ కలెక్షన్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, జూన్ 20(నిఘా న్యూస్):



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక్కరోజు కౌంట్ డౌన్ సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం తరపున హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా యాదవ్ తదితరులు.

– హైదరాబాద్, జూన్ 20(నిఘా న్యూస్):

## రైతు భరోసాతో అన్నదాతకు ఆర్థిక చేయూత

### జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

**శామీర్‌పేట/కలెక్టరేట్, జూన్ 20 (నిఘా న్యూస్):** రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతకు అండగా ఉంటూ ఆర్థిక చేయూతను నందిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 4,859 మంది రైతుల ఖాతాలలో 3.76 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. విడతల వారిగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ పెంపొందించేందుకు రైతు భరోసా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వము రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన మల్కాపూర్ నేతలు



**తూప్రాన్, జూన్ 20 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని ఆదర్శ గ్రామం మల్కాపూర్ కాంగ్రెస్ యువజన నాయకులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడైన ఆంజనేయులు గౌడ్‌ను హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద కలవడం జరిగింది. ముఖ్యంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని వారితో వివరించారు. ఇందులో గ్రామ కమిటీ అధ్యక్షుడు జిన్నా కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె తిరుపతి ముదిరాజ్, తిరుపతి రెడ్డి, మహేష్, మన్నె భాస్కర్, పల్లెపాటి చింటు కొంతం రాజు ఉన్నారు.

## ప్లాంట్స్ గివింగ్ డే సందర్భంగా మొక్కల పంపిణీ



**వలిగొండ, జూన్ 20 (నిఘా న్యూస్):** వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్వర్యంలో శుక్రవారం ప్లాంట్స్ గివింగ్ డే సందర్భంగా విద్యార్థులకి ఫలాలు, నీడ ఇచ్చే మొక్కలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపిడిఓ, డి. జితేందర్ రెడ్డి, మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకోజు భాస్కర్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.స్వామి రాజ్ సమక్షంలో జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల గణేష్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకి ఎంపిడిఓ, విద్యాధికారి, తదితరుల చేతుల మీదుగా మొక్కల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సూపరింటెంట్ నిరంజన్ అలీ, ఉపాధి హామీ ఏపిఓ పరుషరాములు, ఇంజనీర్ బి.విక్రమ్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, లీగల్ సెల్ కానుగంటి శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంబర్ పేట (హ్యారిస్ పెంట) హిందూ స్మశాన వాటిక ప్రబంధ కమిటీ నూతన ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ బిజెపి సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో హిందూ స్మశాన వాటిక ప్రబంధ కమిటీ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ కన్నె రమేష్ యాదవ్ ను ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అనిల్, రాజ్ కుమార్ కృష్ణ గౌడ్, సాయి నందకిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జూన్ 20 (నిఘా న్యూస్):

## కొత్తబస్తీలో పర్యటించిన కార్పొరేటర్ శాంతి



**అల్వాల్, జూన్ 20 (నిఘా న్యూస్):** అల్వాల్ డివిజన్ లోని కొత్తబస్తీ వాసుల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ శాంతి, శ్రీనివాసరెడ్డి, డి ఈ ప్రశాంతి, ఏఈ వరుణ్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి పలు సమస్యలను తీసుకు వచ్చారు. పార్క్ డెవలప్మెంట్, రోడ్లు, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని తదితర సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలన్నీ తొందరలో పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాల్, ప్రేమ్, సాజిద్, యాదగిరి, అరుణ, వాణి, అమూల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మద్దినాయనపల్లిలో వేరుశనగ విత్తనాలు పంపిణీ



**చంద్రగిరి, జూన్ 20 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం మద్దినాయనపల్లి పంచాయతీలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో వేరుశనగ విత్తనాలను టిడిపి నేత ఆనంద్ శుక్రవారం పంపిణీ చేయడం జరిగింది.వేరుశనగ విత్తనాలు కావలసినవారు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ విలేజ్ అసిస్టెంట్ స్వాతి, గ్రామ కమిటీ అధ్యక్షులు జాన్నె ఆనంద్, పాకాల మండలం తెలుగు దేశం పార్టీ జనరల్ సెక్రటరీ పల్గుణ కుమార్, శివయ్య నాయుడు, రాజయ్య, చంద్రశేఖర్, వీరాంజనేయులు, రూపేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**రాజపేట, జూన్ 20 (నిఘా న్యూస్):** రాజపేట మండలం మండల కేంద్రంలోని ఏఐసిసి నాయకులు లోక్ సభ కాంగ్రెస్ పార్టీప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ,మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్మండల పార్టీ అధ్యక్షుడు నెమలే మహేందర్ గౌడ్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడగే పెంటయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి కేదార్ గౌడ్, ఆలేరు,ఏం సి, డైరెక్టర్ చిలువేరుబాలరాజు గౌడ్, విఠల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెడిశెట్టి సురేష్ఐరన్ నవీన్, పెద్దల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అలంపూర్‌లో టిబి ముక్త్ అభియాన్‌పై ప్రజలకు అవగాహన

### జిల్లా టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు

**గద్వాల, జూన్ 20 (నిఘా న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలో శుక్రవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి ముక్త్ అభియాన్ కార్యక్రమంను నిర్వహించారు. టీబీ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు మాట్లాడుతూ దగ్గు, ఆయాసం, జ్వరం, తలనొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు ఉన్న వారు వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలి అని ఆయన అన్నారు. గళ్ళ పరీక్షలు, ఎక్సరే పరీక్షలు లో టీబీ నిర్ధారణ అయినా టీబీ ఉన్న భయపడవలసిన అవసరం లేదని టీబీ మందులు క్రమం తప్పకుండ వాడితే పూర్తిగా తగ్గుతుంది అని ఆయన అన్నారు.టీబీ, మధుమేహం,బి పి, హెచ్ ఐ వి, మద్యపానం, దూమపానం తదితర వ్యాధులపైన ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజుతో పాటుగా జిల్లా పోగ్రామ్ కోఆర్డినేటర్ షాదీక్, హెల్త్ విజిటర్ కిరణ్ కుమార్, హెల్త్ సూపర్ చంద్రన్న, సూపర్ వైజర్ గురుబసయ్య, ఎంఎల్‌హెచ్ పి.వీణశ్రీ, ఏ ఎన్ ఎమ్ కృష్ణ వేణి,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# పేదల ఆశలు నెరవేర్చిన రెవంత్ సర్కార్

### గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి మానకొటండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



**కరీంనగర్, జూన్ 20 (నిఘా న్యూస్):** అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ద్వారా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తున్నట్టు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం మానకొండూర్ మండలంలోని ఊటూరు,రంగపేట, లక్ష్మిపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో వివిధ శాఖల ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నట్టు చెప్పారు. చేపట్టిన పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికపరమైన ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకందారులకు ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి హామీలను ఇప్పటికే అమలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రజల నుంచి డిమాండ్ లేనప్పటికీ వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నదని ఆయన చెప్పారు. త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతీ యువకులకు రుణాలు ఇప్పించే కార్యక్రమాన్ని చేపడుతుందని ఆయన వివరించారు. ఆ వెనువెంటనే కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టనున్నదని ఆయన చెప్పారు. మానకొండూర్ మండలం ఊటూరు గ్రామంలో జడ్పీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రైన్ ను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ప్రారంభించారు. అలాగే ఎన్ఆర్ఈజీఏ నిధులు రూ.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, ఎస్సీ కాలనీలో ఎస్డీఎఫ్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ప్రారంభించారు. రంగపేట గ్రామంలో ఎన్ఆర్ఈజీఏ కింద 25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. లక్ష్మీపూర్ గ్రామంలో కోటి 56 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మండల అభివృద్ధి అధికారి వరలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ రవిప్రసాద్, ఏఈ వెంకన్న, మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్.తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,ద్యావ శ్రీనివాస్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, రామిడి తిరుమాల్ రెడ్డి, కోండ్ర సురేష్, కనకం అశోక్, బి.సునీల్, శంకర్, స్వామి రంగస్వామి, శ్రీనివాస్ మల్లేష్, కుమర్ ఎడ్ల సతీష్, ఎం.నాగిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్ పంపిణీ

### కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 20 (నిఘా న్యూస్):** విద్యార్థులు క్రమశిక్షణ పట్టదలతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి పసుమాముల ప్రాథమిక పాఠశాలలో వారి సొంత ఖర్చులతో విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తెచ్చారు. అదేవిధంగా పాఠశాలకు పెయింటింగ్ వేయించాలని కోరారు. అందుకు స్పందించిన జయపాల్ రెడ్డి పాఠశాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పాఠశాల అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చర్లపల్లి శంకరయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ సర్పల్లి నర్సింగరావు, మాజీ కౌన్సిలర్ పాడి జంగయ్య, నాయకులు బక్కి యాదయ్య గౌడ్, పర్వత్ శ్రీనివాస్ రెడ్డి, చిట్టి రాజు గౌడ్, సంఘీ బిక్షపతి, కూతాడి మల్లేష్, బండ్లగూడెం వెంకటేష్ గౌడ్, కాటం భాస్కర్ గౌడ్, చర్లపల్లి బాబుగౌడ్, గూడపు దర్శన్ గౌడ్, కొత్తపల్లి సందీప్ రెడ్డి, ఏల మధుసూదన్, గగనం శేఖర్, బండ్లగూడెం రాజు, చెవుల మణికిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, జూన్ 20 (నిఘా న్యూస్):** గాజుల రామారం డివిజన్ "ఒక్షిత హిల్ వ్యూ" కాలనీ నందు 60లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్దె ధ్యేయంగా, ప్రజా సంక్షేమమే పరమావధిగా అభివృద్ధి పరుస్తున్నామని అన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, శివారు ప్రాంతాలలో రోజురోజుకు వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని అన్నారు. రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి సర్వతో ముఖాభివృద్ధిగా తీర్చి దిద్దుతామన్నారు. ఒక్షిత హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, ఒక్షిత హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు సి.నాగరాజు, అడ్వైజర్ ఎం. సురేంద్ర, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్ భాయ్, సీనియర్ నాయకులు తెలంగాణ సాయి, మూసా ఖాన్, చెట్ల వెంకటేష్, చందు సుంకరి, బోయిని మహేష్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, దూలప్ప, సమ్మయ్య యాదవ్, రాములు గౌడ్, కరుణాకర్ రాజు, శివా నాయక్, జునైద్, ప్రసాద్, గౌస్, వాహీద్, మహిళా అధ్యక్షురాలు సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు సురక్షితం



### వైద్య ఆరోగ్య అధికారిణి డా. జ్యోతి

**వికారాబాద్, జూన్ 20 (నిఘా న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రులలోనే సురక్షితమైన ప్రసవాలు జరుగుతాయని, గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ జ్యోతి వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని నవాబు పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ జ్యోతి అధ్యక్షతన ఆరోగ్య కార్యకర్తలతో, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన వెంటనే మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కార్డులో గర్భిణీ స్త్రీల పేర్లను నమోదు చేయాలని సూచించారు. డాక్టర్ల సూచనల ప్రకారం గర్భిణీ స్త్రీలు ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఆరవ నెల నుండి 8వ నెల వరకు గర్భిణీ స్త్రీలు 15రోజులకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. 8వ నెలలో వారానికి ఒక్కరోజు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు సుఖ ప్రసవం అయ్యేవరకు ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రసవనంతరం బాలింతల ఇంటి సందర్శన తప్పనిసరి అన్నారు. శిశు ఆరోగ్యం ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ప్రసవానికి బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం ఉండేటట్లు బాలింతలకు, అర్హులైన మహిళలకు అవగాహన కల్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.ఎన్ బ్యులా, సూపర్వైజర్లు శోభ, సుగుణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య సమాజానికి యోగా అద్భుత మార్గం : మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, జూన్ 20(నిఘా న్యూస్):** నేటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత,ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. యోగా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని,శారీరకంగా మానసికంగా సమతుల్యం సాధించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో యోగా కార్యక్రమాలను ప్రోత్సహించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని నామ ఆకాంక్షించారు.

## ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**కర్నూలు, జూన్ 20 (నిఘా న్యూస్):** గత నాలుగు రోజుల నుండి తుగ్గలిలోని శ్రీ రామాలయం నందు జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలతో వైభవంగా ముగిశాయి. మూడు రోజులపాటు డాక్టర్ దేవి దయానంద సింగ్ శ్రీమద్రామాయణము మహాభారతం భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, ప్రతిరోజు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మాన్ని సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఉద్ఘాటించారు.కార్యక్రమంలో ఎ.కోదండ రాముడు, జి.ఓంకారప్ప, బి.గంగాధర్, బి.ఈశ్వరప్ప బి.కోదండ రాముడు, ఎం.లక్ష్మన్నతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి నిరంతరం కృషి

### మంత్రి శ్రీహరిని కలిసిన మత్స్యకార సహకార సంఘం సభ్యులు



**పెబ్బేరు, జూన్ 20 (నిఘా న్యూస్):** మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రాష్ట్ర నూతన మంత్రివర్గంలో చోటు దక్కడం పట్ల పెబ్బేరు మండలం శాఖాపురం గ్రామ మత్స్యకార సహకార సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటగా ఆత్మకురు పర్యటనలో భాగంగా నూతన మంత్రిని పెబ్బేరు మండలం శాఖాపురం గ్రామ మత్స్యకార సహకార సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రాష్ట్ర నూతన మంత్రివర్గంలో చోటు దక్కడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తుందన్నారు. పూల బోకే, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంద చెన్నకేశవులు, గువ్వల రాములు,పుట్ట తిరుపతయ్య,సంద వీరేష్, గువ్వల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## కొలిమిగుండ్లలో రెవెన్యూ దినోత్సవ వేడుకలు

**కొలిమిగుండ్ల, జూన్ 20 (నిఘా న్యూస్):** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు మండలంలోని రైతులు ప్రజలు కలిసి శుక్రవారం రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ దినోత్సవ వేడుకలు సందర్భంగా టిడిపి నాయకులు కోటపాడు శివరామిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, దాసరి గోపాల్, ఎర్రగుడి రాజగోపాల్, టైలర్ వెంకట్రాముడు, టివి రాముడు ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు మండలంలోని ప్రజలు రైతులు పాల్గొని తహసిల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసిల్దార్ విశ్వతేజ, సర్వేయర్ సరితను రైతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, నాగరాజు,వీఆర్వోలు ప్రసాద్ రెడ్డి, నారాయణరెడ్డి, ఇంకా తదితర వీఆర్వోలు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేసిన మంత్రి గడ్డం

సిద్దిపేట, జూన్ 20 (నిఘా న్యూస్): సిద్దిపేట శాశనసభ నియోజకవర్గ పరిధిలోని మండలాలల్లో రెండవ విడుత మంజూరు ఐన 2840 మంది ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం రాష్టంలో అర్హులైన ప్రజలందరికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన ఎనిమిది లక్షల కోట్ల అప్పులు ఉన్నపటికీ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు విషయంలో వెనకడుగు వేయకుండా కొనసాగిస్తున్నా మని అన్నారు. ఆరోజుల్లో ఇందిరమ్మ గరీబీ హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలన పథకాలను తీసుకు వచ్చిందని, అదేవిదంగా కొనసాగలని సోనియా, రాహుల్ గాంధీలు పాటు దుతున్నారని అన్నారు. గత 12సంవత్సరాల క్రితం వైఎస్ హయాంలో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పక్కఇల్లు పట్టా సర్టిఫికెట్లు కూడా ఇచ్చామని అన్నారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వం ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన నాటినుండి విడుతల వారిగా ఐదు లక్షల రూపాయలు నేరుగా తమ ఖాతాలో జమ చేయబడుతాయని, దళితులకు అదనంగా మరో లక్ష రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని అన్నారు.

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదిహేను నెలల్లో జిల్లాకు పన్నెండు వేల ఇండ్లు మంజూరు చేశామని, రాష్టంలో ఎక్కడలేని విదంగా ఒక సిద్దిపేట నియోజకవర్గానికి మూడు వేల ఇండ్లు మంజూరు చేశామని అన్నారు. ప్రతి యేటా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున రాష్ట్ర ప్రజలందరికి ఇస్తామని, అవసరమైతే జిల్లాకు మరిన్ని అదనంగా మంజూరు అయ్యే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాటాడుతానని అన్నారు. గృహ లక్ష్మి పథకం ద్వారా ఒక్కొక్క ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను, జిల్లాకు లక్ష డెబై ఎనిమిది వేల గృహాలకు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, సిద్దిపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ కడవేర్లు మంజుల, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, సిద్దిపేట ఆర్డీఓ సాధానందం, హౌసింగ్ పీడీ దామోదర్ రావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## యోగాలో కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవాణి



**రామంతపూర్, జూన్ 20 (నిఘా న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎల్బీ స్టేడియంలో కేంద్ర మంత్రి తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి సమక్షంలో నిర్వహించే కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రామంతపూర్ 9వ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, మేడ్చల్ ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి రేవు నరసింహ కురుమ, సంకూరి కుమారస్వామి, ఉలుగొండ నారాయణదాసు, వేముల తిరుపతయ్య, పడిగం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం




**హబ్సిగూడ, జూన్ 20 (నిఘా న్యూస్):** శాఖపరమైన మరమ్మత్తుల కారణంగా ఈ నెల 21వ తేదీ శనివారం 11 కెవి రవీంద్ర నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ హబ్సిగూడ ఏఈ. వి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమయంలో రవీంద్ర నగర్ స్ట్రీట్ నెంబరు 3 నుండి 27 వరకు, జేఎస్ఎన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఐఎస్ఐ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 5:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఆ సమయంలో జెఎస్ఎన్ కాలనీ, జి. జి. కాలనీ, శోభన నగర్, వివేకానంద నగర్, బృందావన్ నగర్, స్నేహ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఏఈ గణేష్ విజ్ఞప్తి చేశారు.

## బిజెపి మండల ఉపాధ్యక్షులుగా మందుల నాగరాజు



**వలిగొండ, జూన్ 20 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల ఉపాధ్యక్షులుగా నాగారం గ్రామానికి చెందిన మందుల నాగరాజు ని నియమిస్తూ ప్రకటన విడుదల చేసిన మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ పార్టీకి విధేయుడుగా బూత్ అధ్యక్షుడి స్థాయి నుండి మండల పార్టీ ఉపాధ్యక్షులు స్థాయికి ఎదిగిన నాగరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం

### ఎంఐఎం మండల అధ్యక్షులు ఎండి అప్రోజ్



**పెబ్బేరు, జూన్ 20 (నిఘా న్యూస్):** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని పేద ముస్లిం కుటుంబానికి శుక్రవారం ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు ఎండి అప్రోజ్ ఆర్థిక సాయం అందజేసి తన దాత్రత్వాన్ని చాటుకున్నారు. పేద ముస్లిం మహిళ కూతురు వివాహానికి ప్రత్యేక చొరవతో మోమినిన్ చారిటబుల్ బండ్లగూడ (హైదరాబాద్)ట్రస్ట్ ద్వారా అమ్మాయి వివాహానికి సంబంధించిన పెళ్లి సామాగ్రిని ఆ కుటుంబానికి అందించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సామాగ్రిని అందించి వారి కుటుంబానికి అండగా నిలిచిన ఎంఐఎం పార్టీ నాయకులకు ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు జాకీర్, జయరాజ్, అమేర్, సమీర్, ఇర్ఫాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఐకేర్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి పొంగలేటి

**మధిర, జూన్ 20 (నిఘా న్యూస్):** మధిరలో కార్పొరేట్ హంగులతో నూతనంగా నిర్మించిన హై కేర్ ఆసుపత్రిని శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మధిర ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఐకేర్ ఆసుపత్రిని నిర్మించామని డాక్టర్ జంగా నవీన్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్, విజయవాడ స్థాయిలో కార్పొరేట్హంగులతో అధునాతన వైద్య పరికరాలు, ల్యాబ్ ఐకేర్ హాస్పిటల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎంపీ రామ సహాయం రఘురామి రెడ్డిలను ఘనంగా సన్మానించారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

### తెలంగాణ ప్రభుత్వానికి ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి



**బాగ్‌లింగంపల్లి, జూన్ 20(నిఘా న్యూస్):** వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ సీజన్‌లో ప్రతి రైతు కుటుంబం కనీసం కొంత మేరకైనా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే తెలంగాణ రైతులు కూడా ఆధునిక, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన ఆవశ్యకత ఉందని కౌన్సిల్ అభిప్రాయపడింది. సాంప్రదాయ రసాయన ఆధారిత వ్యవసాయ పద్ధతులు పర్యావరణ కాలుష్యానికి దారితీయడమే కాకుండా, రసాయన వ్యర్థాలతో కూడిన ఆహార పదార్థాల వినియోగం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని గుర్తు చేసింది. ప్రజల్లో సేంద్రియ ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న అవగాహన, వాటి కోసం పెరుగుతున్న డిమాండ్‌ను రైతులు గుర్తించాలని సూచించింది. రసాయన విధానాలకే పరిమితమైతే భవిష్యత్తులో మార్కెట్ కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఈ సమస్యను నివారించడానికి, ప్రభుత్వం ప్రకృతి సేద్యంపై రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు, 100 శాతం రాయితీ, ప్రత్యేక మార్కెట్ వసతి కల్పించి ప్రోత్సహించాలని సంస్థ అధ్యక్షుడు రంగయ్య డిమాండ్ చేశారు.

## ప్రేమ్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



అంబర్‌పేట, జూన్ 20(నిఘా న్యూస్): అంబర్ పేట్ డివిజన్ రఘునాథ్ నగర్, ప్రేమ్ నగర్ బస్తీలలో కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, మా విద్యుత్ వైర్ల పైన ఉన్న చెట్ల కొమ్మల సమస్యలను ఆయన పరిశీలించారు. సిబ్బందిని అక్కడికి పిలిపించి చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. అలాగే వీలైనంత త్వరగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులు సూచించారు, బోనాల పండుగ సమీపిస్తుండడంతో రఘునాథ్ నగర్ లో ఉన్న అమ్మవారి ఆలయం చుట్టుపక్కల పారిశుద్ధ్య పనులు అలంకరణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం ప్రేమ్ నగర్‌లో వేస్తున్న నూతన డ్రైనేజ్ పైప్ లైన్ పనులను పరిశీలించి వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ స్థానిక బస్తీ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్థానిక బస్తి ప్రజలు పాక నర్సింగ్, శ్రవణ్ కుమార్,రమేష్, ఈశ్వర్, కృష్ణ, రాజ్ కుమార్, సంతోచారి, సాయి కళ్యాణ్,అరుణ్ కుమార్, రాజు, లక్ష్మమ్మ, రాము లక్ష్మణ్, సాయిజ సునీల్, హార్టికల్చర్ సిబ్బంది లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కామ్రేడ్ వేముల మహేందర్ వర్ధంతి



**వలిగొండ, జూన్ 20 (నిఘా న్యూస్):** వలిగొండ మండలంలో కమ్యూనిస్టు పార్టీ అంటే వేముల మహేందర్ అని వేముల మహేందర్ అంటే కమ్యూనిస్టు పార్టీ అనే విధంగా కొనసాగింది. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఘనంగా ఏర్పాట్లను చేసిన కార్యకర్తలు. ఆయన 33 ఏళ్ల ప్రజా జీవితం జనం ఆయన్ను కమ్యూనిస్టు మహేందర్/పులిగిల్ల మహేందర్ అని పిలిచేవారు.సుమారు 33 సవత్సరాలపాటు ప్రజల పట్ల అంకితభావంతో, సిపిఎం పార్టీ పట్ల ఆచెంచల విశ్వాసంతో,ఎలాంటి వ్యాపకాలు లేని పూర్తికాలం కార్యకర్తగా తన జీవితాన్ని గడిపాడు "తెల్లటి బట్టలతో నల్లటి ముఖం మీద మల్లెపూవులాంటి చిరునవ్వుతో అందరిని ఆప్యాయంగా పలకరించే నైజం ఆయన సొంతం.

## రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



### మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి

**ముస్తాబాద్, జూన్ 20 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనమేని రాజు ఆధ్వర్యంలో రైతులతో కలిసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పార్టీ అన్నారు. ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి నుండి ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వరకు రైతులకు బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి,రాష్ట్రంలోని రైతులకు 25 వేల కోట్ల వరకు రుణాలు మాఫీ అయ్యాయన్నారు. అలాగే రైతు భరోసా కింద పంట పెట్టుబడి సహాయం ఇంతక ముందు ప్రభుత్వం ఇచ్చినట్లుగా రాళ్ళ కు గుట్టలకు వెంచర్స్ కి రోడ్లకు కాకుండా పండించే ప్రతి రైతుకు లబ్ధి చేకూర్చాలి అనే ఉద్దేశంతో వ్యవసాయ అధికారులతో మళ్లీ సర్వే చేయించి కేవలం పంట పండించే రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. సన్న వడ్లు పండిస్తే క్వింటాలకు ఐదు వందల చొప్పున బోనస్ చెల్లించడం రైతులకు మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేపట్టడం గర్వకారణమని ఈ ఘనత దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకే దక్కిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ ఓరుగంటి తిరుపతి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, ఉచ్చిడి బాల్ రెడ్డి, అన్నం శ్రీధర్ రెడ్డి,మామిండ్ల ఆంజనేయులు, తోట ధర్మేందర్, మెరుగు కిరణ్ కుమార్, జిల్లా నాయకులు,మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళలు సంతోష, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిప్లడైన్ బ్రాండ్ అంబాసిడర్ గా నీనా గుప్తా



**హైదరాబాద్, జూన్ 20 (నిఘా న్యూస్):** కన్జ్యూమర్ హెల్త్ కేర్‌లో అగ్రగామి సంస్థ అయిన సిప్లా హెల్త్ తన తాజా క్యాంపెయిన్ సిప్లడైన్-ఆప్కా ఫాస్ట్ ఎయిడ్ ఎక్స్ పర్ట్ ను ప్రముఖ నటి నీనా గుప్తా బ్రాండ్ అంబాసిడర్ గా ప్రారంభించినట్లు సిప్లా హెల్త్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ శివమ్ పురి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోతలు, గాయాలు, కాలిన గాయాలు, అంటువ్యాధులకు భారతదేశపు నెం.1 నమ్మకమైన పరిష్కారంగా సిప్లడైన్ స్థానాన్ని ఈ ప్రచారం బలపరుస్తుం దన్నారు. ఇది చాలా అవసరమైన సమయంలో వేగంగా ప్రభావ వంతమైన వైద్యం అందిస్తుందన్నారు.



వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు కీర్తిశేషులు కాడిగల రాములమ్మ కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆకుల మంజుల వెంకన్న ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి దస్తగిరి ఆజ్మీయ ఏర్పుల గంగయ్య ఇంజమూరి రామ లక్ష్మయ్య కడిగల నరసింహ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

- వలిగొండ, జూన్ 20(నిఘా న్యూస్):

## రైతులు ట్రేడర్లతో జేసి బన్సల్



**చంద్రగిరి, జూన్ 20(నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్ లో రైతులతో,ట్రేడర్లతో శుక్రవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్,ఆర్డీఓ రామ్మోహన్ కలిసి మాట్లాడారు.కార్యక్రమానికి చంద్రగిరి డి.ఎస్.పి బేతంపూడి ప్రసాద్ విచ్చేశారు.దామల చెరువు వద్ద గల ర్యాంపులను పరిశీలించారు. ప్రతి చివరి మామిడికాయ వరకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు కేజీకి నాలుగు రూపాయలు చొప్పున సబ్సిడీని అందజేస్తుందని ఆ మొత్తాలను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేస్తుందన్నారు. ఎక్కడ కూడా ప్రభుత్వం ఎకరాల పరిమితి విధించలేదని, రైతుల వద్ద ఎంత పంట ఉంటే అంత పంటను జిల్లాలోని పల్ప్ ఇండస్ట్రీలకు అందించవచ్చని తెలిపారు.ప్రతి రాంపు వద్ద విఆర్వోలను,పోలీస్ కానిస్టేబుల్ ను తప్పనిసరిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు తక్కువ ధర చెల్లించకుండా చూడాలన్నారు. పాకాల మండలం,రామిరెడ్డి ఇండ్లు గ్రామం, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామి రెడ్డి, పాకాల తహసిల్దార్ సంతోష్ సాయి, పాకాల సీఐ సుదర్శన ప్రసాద్, హార్టికల్చర్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటరమణ



**వికారాబాద్, జూన్ 20 (నిఘా న్యూస్):** నేడు జూన్ 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని, జిల్లా పరిధిలోని డాక్టర్లు, వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.వెంకటరమణ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఆరోగ్య ఉప కేంద్రాలలో, బస్తీ దవాఖానాలలో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో యోగా దినోత్సవాన్ని తప్పనిసరి జరపాలని ఆదేశించారు. ఉదయం 7 గంటల నుండి, 8 గంటల వరకు యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు.

# నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్లను గ్రౌండింగ్ చేయాలి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశం

**శామీర్‌పేట/కలెక్టరేట్, జూన్ 20 (నిఘా న్యూస్):** మేడ్చల్ జిల్లాకు మంజూరైన 1,409 ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ను నెలాఖరు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకు గాను గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు ఇంటింటా తిరిగి గ్రౌండింగ్ జరిపించాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాకు మంజూరైన ఇళ్లను 10 రోజుల్లోగా వంద శాతం గ్రౌండింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, జిల్లాకు 1409 ఇళ్లు మంజూరు కాగా అందులో 516 ఇళ్లు ఇప్పటి వరకు గ్రౌండింగ్ జరిగాయని, ఇంకా 900 ఇళు గ్రౌండింగ్ కావాల్సి ఉందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ మూర్తి కలెక్టర్ కు వివరించగా, కలెక్టర్ స్పందిస్తూ, గ్రౌండింగ్ కు మిగిలిన 900 ఇళ్లను 8 మంది ఏ.ఈ లు ఒక్కొక్కరికీ 125 ఇళ్ల చొప్పున బాధ్యత ఇచ్చి ఇంటింటికి తిరిగి వచ్చే వారంలోగా గ్రౌండింగ్ జరిపించేలా చూడాలని ఆదేశించారు. అలాగే, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న , స్థానిక కోటాకు సంబంధించిన వెయ్యి 2 - బి.హెచ్.కే ఇళ్లను కూడా ఎల్ - 2 జాబితాలో ఉన్న వారికి కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా, డబ్బులు లేక ఇందిరమ్మ ఇళ్ల బేస్మెంట్ నిర్మాణం చేయలేక పోతున్న వారికి మహిళా సంఘాలలో చేర్పించి, వారికి లక్ష రూపాయల రుణాలు మంజూరు చేర్పించడం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మను చౌదరి గృహ నిర్మాణ సంస్థ అధికారులు లబ్ధిదారులు, ఇంజనీర్లకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్త, జిల్లా హౌసింగ్ పీ.డీ రమణ మూర్తి లు, డిఇ లు, ఏఈ, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ డే

### మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి,జూన్20(నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ దినోత్సవ వేడుకలకు సిద్ధమైంది.. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు నిర్వహించనుంది.. దీని కోసం జిల్లాకు 2 లక్షల రూపాయల చొప్పున రూ.52 లక్షలు రెవెన్యూ డేకు ప్రభుత్వం విడుదల చేసింది.. రెవెన్యూ డే సందర్భంగా ప్రతీ రెవెన్యూ జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నారు.. రెవెన్యూ ఉద్యోగుల బాధ్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి.. రెవెన్యూ దినోత్సవ వేడుకలపై రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. రేపు జరిగే రెవెన్యూ దినోత్సవాన్ని జయప్రదం చేయండి అంటూ పిలుపునిచ్చారు.. ప్రతి ఏటా జూన్ 20వ తేదీన అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో రెవెన్యూ దినోత్సవాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.. ప్రజలకు, రైతులకు భూ సంబంధ అంశాలపై అవగాహన కల్పిస్తామని.. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి సలహాలు స్వీకరిస్తామన్నారు.. ఇక, ఉత్తమ సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులకు ఈ సందర్భంగా సన్మానం చేస్తామని పేర్కొన్నారు.. బాగా పని చేసిన రెవెన్యూ ఉద్యోగులను గుర్తించి కమేండేషన్ సర్టిఫికేట్ జారీ చేస్తాం.. రెవెన్యూ దినోత్సవంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు.

# ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఫోటోపై వివాదం

### ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ గందరగోళం

**సిద్దిపేట,జూన్20(నిఘా న్యూస్):** దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ గందరగోళంగా మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లెక్సీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫోటో చిన్నదిగా ఉండటంతో ఎమ్మెల్యేతోపాటు భారాస కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతో భారాస కార్యకర్తలకు పోటీగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారులు, పోలీసులు సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా ఇరు వర్గాలు తగ్గకపోవడంతో కార్యక్రమం రసాభాసగా మారింది. అదే సమయంలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అక్కడి చేరుకున్నారు.పరిస్థితి చూసి జిల్లా పాలనాధికారి హైమావతి.. పోలీసులు, అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభా వేదిక పైకి వచ్చిన ఎమ్మెల్యే.. ప్రోటోకాల్ లేని వ్యక్తులు దిగాలని సూచించడంతో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో మరోసారి ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణ నెలకొంది. దీంతో హడావిడిగా మంత్రి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేసి వెళ్లిపోయారు.

# పవన్ కళ్యాణ్ కనిపించారా

### వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల

**శ్రీసత్యసాయి,జూన్20(నిఘా న్యూస్):** వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏవేవో మాట్లాడిన పిఠాపురం పీఠాధిపతి ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనబడటం లేదని వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల విమర్శించారు. శ్రీ సత్యసాయిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో 'డిప్యూటీ సీఎం' పవన్ కళ్యాణ్ ఎక్కడైనా కనిపించారా? అంటూ శ్యామల ప్లకార్డ్ ప్రదర్శించారు. పవన్ గురించి శ్యామల చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పవన్ కళ్యాణ్ సహా నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణపై కూడా యాంకర్ శ్యామల హాట్ కామెంట్స్ చేశారు. 'రాష్ట్రంలో కూటమి నాయకుల గెలుపు కానే కాదు.. అంతా మాయ. హిందూపూర్‌లో ఓ పోలింగ్‌లో వైసీపీకి ఒక్క ఓటు వచ్చిందంటే.. నందమూరి బాలకృష్ణ గెలుపు ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. బాలకృష్ణది అసలు గెలుపు కానే కాదు. మూడుసార్లు ఎమ్మెల్యేగా బాలకృష్ణ గెలిచినా.. హిందూపూర్‌లో అభివృద్ధి శూన్యం. హిందూపూర్‌లో డిగ్రీ కళాశాల లేని పరిస్థితి ఉంది, కేవలం బోర్డుకే పరిమితమైంది. బాలకృష్ణ సినిమా షూటింగ్‌లో బిజీ, ఆరు నెలలకు ఒకసారి హిందూపూర్ వస్తారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏవేవో మాట్లాడిన పిఠాపురం పీఠాధిపతి ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనబడటం లేదు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు ఎక్కడైనా కనిపించారా?' అంటూ శ్యామల ప్లకార్డ్ ప్రదర్శించారు.

# బాసర ట్రిపుల్ ఐటిలో నేటితో దరఖాస్తులకు నేడు చివరితేదీ

**బాసర,జూన్ 20(నిఘా న్యూస్):** బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు జూన్ 21చివరి తేదీతో ముగియనుంది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 18,775 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. జూలై 4న ప్రవేశ ఫలితాలు విడుదల చేయబడతాయి. జూలై 7న మొదటి విడత కౌన్సిలింగ్ ప్రారంభమవుతుంది. ఆర్జీయూకేటీ అందించే ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులకు ఉచిత నివాస విద్య, ఆధునిక ప్రయోగశాలలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు వంటి అనేక వసతులు కల్పిస్తూ, ఈ విశ్వవిద్యాలయం విశిష్టతను చాటుకుంటోందని పేర్కొన్నారు.

# విజయవంతంగా ముగిసిన రెవెన్యూ సదస్సులు

### తూప్రాన్ ఆర్‌డిఓ జయ చంద్రారెడ్డి



**తూప్రాన్, జూన్ 20 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిసాయని ఆర్. డి.ఓ జయచంద్రా రెడ్డి అన్నారు. తూప్రాన్ డివిజన్ పరిధిలో భూ సమస్యలపై 8,229 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్, విస్తీర్ణం సవరణ, పేరు సవరణ, పెండింగ్ మ్యుటేషన్, ఫౌతి విరాసత్, డిజిటల్ సంతకం పెండింగ్, సాదాబైనమా, పి ఓ టి, కుటుంబ తగాదాలు వంటి ఇతర భూసమస్యలకు దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందరి భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని, సాదాబైనామా, పి ఓ టి. దరఖాస్తులను ప్రభుత్వం ఇచ్చే సూచనల మేరకు పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తు దారులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం భూ భారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థ తీసుకొచ్చిందని అందరి భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ బృందం రెవెన్యూ సదస్సులో క్రమం తప్పకుండా, ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా, టోకెన్ పద్ధతిలో పకడ్బందీగా నిర్వహించారని ప్రతినిత్యం సాయంత్రం వరకు గ్రామంలోనే ఉంటూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రైతులకు అందుబాటులో ఉన్నారని ఆయన తెలిపారు. ఇందుకు రైతులు, గ్రామ ప్రజలు సహకరించారని, వీరి సహకారంతోనే సదస్సులు సజావుగా, ప్రశాంతంగా ముగిసాయని ఆర్డీఓ జయ చంద్రారెడ్డి తెలిపారు.

# నగరంలోని పారామౌంట్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్

- వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసిన విదేశీయులు
- 18మంది అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించిన పోలీసులు
- వారిని డిపోర్ట్ చేస్తామని ప్రకటించిన సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ

**హైదరాబాద్,జూన్20(నిఘా న్యూస్):** హైదరాబాద్ నగరంలోని పారామౌంట్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున పెద్దఎత్తున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్రమ చట్టవ్యతిరేక కార్యకలాపాలు, విదేశీయుల అక్రమ నివాసాలపై ఆధారంగా పోలీసులు ఈ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 150 మంది పోలీసులు తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఈ కాలనీని చుట్టుముట్టి సోదాలు ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్ ఫోర్స్, హెచ్‌ఎన్‌యూ, ఏఆర్ విభాగాలకు చెందిన పోలీసులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. ఈ సెర్చ్‌లో నైజీరియా, ఇథియోపియా, కెన్యా, సోమాలియా దేశాలకు చెందిన వలసదారులు పెద్దఎత్తున ఉన్నట్లు గుర్తించారు. వీరిలో చాలామంది భారతదేశం వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తూ ఇల్లీగల్ కార్యకలాపాల్లో భాగం అవుతున్నట్లు పోలీసుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల్లో మొత్తం 18 మంది విదేశీయులు వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా జీవిస్తున్నట్లు గుర్తించారు. వారిని గుర్తించిన పోలీసులు త్వరలోనే డిపోర్ట్ చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ సోదాల సందర్భంగా డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 50కి పైగా బైకులు, 5 కార్లను పోలీసులు సీజ్ చేశారు. అంతేకాక, గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న బెల్ట్ షాపులు, హుక్కా సెంటర్లను గుర్తించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు, గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. మద్యం అక్రమ నిల్వలు బయటపడటంతో, స్థానికంగా నడుస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలపై మరింత దృష్టి పెట్టనుని పోలీసులు అన్నారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ, 'పారా మౌంట్ కాలనీలో కార్డన్ సెర్చ్‌తో పాటు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండిపోయిన విదేశీయులను గుర్తించాం. వారి వివరాలు సేకరించి, త్వరలోనే డిపోర్ట్ చేయనున్నాం. మాదకద్రవ్యాల విషయంలో మేము చాలా సీరియస్‌గా ఉన్నాం. ఈ సెర్చ్‌లో డ్రగ్స్ లభించలేదు. కానీ భవిష్యత్‌లో ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌తో నగరంలోని ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో కూడా ఇలాంటి తనిఖీలు జరపనున్నట్లు పోలీసులు సంకేతాలు ఇస్తున్నారు. విదేశీయుల పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు ఇది ఒక ముందడుగుగా మారింది.

# కెసిఆర్‌ను విలన్ చేయే యత్నంలో హరీష్

### నీళ్లతో రాజకీయం చేసిన పార్టీ బిఆర్ఎస్
### జగన్‌తో కుమ్మక్కయి కృష్ణ జలాలకు తిలోదకాలు
### భువనగిరి ఎంపి చామల కిరణ కుమార్

**హైదరాబాద్,జూన్20(నిఘా న్యూస్):** బీఆర్ఎస్ నేత హరీష్ రావు వాళ్ల మామ.. మాజీ సీఎం కేసీఆర్‌ను విలన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ ఆరోపించారు. నీళ్ళు అనే పదంతో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని, బీఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్‌తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని అన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్థమైందని, 2016 సీడ్ల్యూసీ మీటింగ్‌లో కేసీఆర్ ఏం మాట్లాడారో చెప్పాలన్నారు. కేసీఆర్‌కు ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయిందని విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డితో నాలుగు సార్లు మంతనాలు జరిపి తెలంగాణ నీళ్లకు అన్యాయం చేసింది కేసీఆర్ అని, హరీష్ రావు వైఖరి వల్లే ఏపీ నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారని చామల కిరణ్ అన్నారు. గోదావరి జలాలపై గొంతు చించుకునే బీఆర్ఎస్ నేతలు.. కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హరీష్ రావుకు కంటెంట్ కంటే ఎక్కువ ఆవేశమే ఉందని, బీఆర్ఎస్ నేతలు సీఎం కుర్చీలో రేవంత్ రెడ్డిని చూడలేక పోతున్నారని అన్నారు. నదీ జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ రావు తెలుసుకోవాలన్నారు. నీళ్ళ అంశంపై తనకు, కేసీఆర్‌కు తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారని, తెలంగాణ నీటిని ఏపీకి ధారాదత్తం చేసిందే కేసీఆర్ అని చామల కిరణ్ ఆరోపించారు. హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైందన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి కమిట్‌మెంట్ అర్థం చేసుకోవచ్చునని అన్నారు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామని అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేసారన్నారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారన్నారు. బేసిక్స్ కాదు తమకు ఎథిక్స్ ఉన్నాయి కాబట్టే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఎంపీ చామల కిరణ్ అన్నారు.

# 100రోజుల ప్రణాళికలో కట్టు కాలువ శుద్ధీకరణ

**తూప్రాన్, జూన్ 20 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మున్సిపల్ ప్రాంతాలను నివాస యోగ్యమైన, స్థిరమైన, పర్యావరణ, అనుకూలత నగరాలుగా అభివృద్ధి చేయడం కోసం పట్టణంలో నివసించే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించే మంచి ఉద్దేశంతో, ఒక్క అడుగు మార్పు కోసం అనే నినాదంతో ప్రత్యేక పారిశుద్ధ్య వివిధ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా శుక్రవారం తూప్రాన్ పరిధిలోని 13వ వార్డులో తడి పొడి చెత్త వేరు చేయు విధానంపై అవగాహణ కల్పించడం, వర్ష కాలం దృశ్య అంటువ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియపరిచారు. 2వ వార్డులో సమీపంలో ఉన్న కట్టు కాలువ జెసిబి సహాయంతో శుద్ధికరణ చేశారు. ముఖ్య కూడలిలో బ్లీచింగ్ పిచికారి చేయడం, ఒకటవ వార్డులో వాటర్ లో క్లోరినేషన్ టెస్టు నిర్వహించడం, 5వ వార్డులో వాటర్ ట్యాంక్ లను శుభ్ర పరచడం, పబ్లిక్ టాయిలెట్స్ పర్యవేక్షించడం, పట్టణంలో డోర్ టు డోర్ ట్యాప్ కనెక్షన్ సర్వే, ఆన్లైన్ ద్వారా నమోదు చేయడం, ట్రేడ్ లైసెన్స్ వెరిఫికేషన్ మొదలగు పరిశుభ్రత కార్యక్రమాలు



తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# పోలవరంతో భద్రాచలం మునక

### రాముడు తెలంగాణలో.. భూములు ఎపిలో
### ఎపిలో కలిపిన ఐదూళ్లు వెంటనే వెనక్కి ఇచ్చేయాలి
### తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత డిమాండ్

**హైదరాబాద్,జూన్20(నిఘా న్యూస్):** పోలవరం నిర్మాణంతో భద్రాచలం పూర్తిగా మునిగిపోవడం ఖాయమని, అందుకే తాము పోలవరం ప్రాజెక్టు నిర్వహణ అంశాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యతిరేకించామని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అప్పట్లో తాము సుప్రీంకోర్టుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేసినా ప్రాజెక్టు ఆగలేదని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ముంపుపై శుక్రవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని, పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆమె అన్నారు.పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందన్నారు. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి మాన్యం వెయ్యి ఎకరాలు ఉందని, ఆ వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకు పోయిందన్నారు. దేవుడేమో తెలంగాణలో ఉన్నాడని.. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంత మవుతోందన్నారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని కవిత అన్నారు.ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్ గడ్ సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలని, ఐదు గ్రామాలను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి చేయాలని కవిత అన్నారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. లేదంటే ఎప్పుడైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయన్నారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందన్నారు. 2014లో ప్రధాని మోదీ మొట్ట మొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను ఆమోదించి తెలంగాణకు అన్యాయం చేశారని విమర్శించారు. ఆ ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారన్నారు. లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీకి అప్పజెప్పారని... బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని విమర్శించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో మేము గళమెత్తామన్నారు. కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చినా కేంద్రానికి చీమకుట్టినట్టుగా లేదన్నారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సామర్థ్యం 36లక్షల క్యూసెక్కుల నుంచి 50లక్షల క్యూసెక్కులకు పెంచుకుంటూ పోవడంతో ముంపు పెరిగిపోతోంది. మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కారం చేయాల్సిన అవసరముంది. పురుషోత్తమపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామపంచాయతీ లను వెనక్కి ఇవ్వాలి. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట 4 రాష్ట్రాల సీఎంలతో ప్రధానమంత్రి మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇస్తున్నట్లు ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం




**ఉప్పల్, జూన్ 20(నిఘా న్యూస్):** శాఖపరమైన మరమ్మత్తుల కారణంగా ఈనెల 21వ తేదీ శనివారం 11 కెవి భగాయత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ విద్యుత్ శాఖ ఏ.ఈ. బి. కిరణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమయంలో ఉప్పల్ బాగాయత్, ఆరెంజ్ ఆర్ట్ లైన్, ఎస్.ఎస్. కన్స్ట్రక్షన్స్, హెచ్ఎండిఏ లేఔట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. 11 కెవి శాంతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏది తెలిపారు. ఆ సమయంలో బాలాజీ నర్సింగ్ హోమ్, విజయపురి కాలనీ, యాంకర్ స్కూల్ లైన్, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కెవి సత్యా నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఆ సమయంలో సత్య నగర్, శాంతినగర్, ట్రై కలర్ అపార్ట్మెంట్స్, వెంకటేశ్వర కాలనీ, ఆదిత్య హాస్పిటల్, మైఫిల్ హోటల్, నల్ల పోచమ్మ టెంపుల్ లైన్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

**చిలుకానగర్ సెక్షన్ పరిధిలో..**

చిలుక నగర్ విద్యుత్ శాఖ సెక్షన్ పరిధిలో శాఖపరమైన మరవత్తుల కారణంగా మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ. వినయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఆ సమయంలో వీరారెడ్డి కాలనీ, ఇందిరానగర్, జ్యోతి నగర్, అన్నపూర్ణ కాలనీ, కమల నగర్, సిసిఎంబి కాలనీ తదిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

# గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు



**వికారాబాద్, జూన్ 20 (నిఘా న్యూస్):** వికారాబాద్ మండల పరిధిలోని సిద్ధలూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సుధాకర్ రెడ్డి గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు సాధారణ ప్రసవాలకే సిద్ధం కావాలని అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా ఓ.పి వైద్య విభాగానికి అనారోగ్య సమస్యలతో సందర్శించిన ప్రజలకు వైద్య సేవలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఐలయ్య, పి. హెచ్. ఎన్ రాజమణి, సూపర్వైజర్లు భారతి, సుకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్ కోసం గగనతలం తెరిచిన ఇరాన్

### ఇరాన్ నుంచి భారతీయ విద్యార్థులు వెనక్కి

**న్యూఢిల్లీ,జూన్ 20(నిఘా న్యూస్):** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఉధృతమవుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇండియాకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే మూసివేసిన ఎయిర్‌స్పేస్‌ను ఆ దేశం తెరిచింది. దీంతో ఇరాన్ నగరాల్లో చిక్కుకుపోయిన సుమారు 1,000 మంది భారతీయ విద్యార్థులను 'ఆపరేషన్ సింధు' కింద ప్రత్యేక విమానాల్లో న్యూఢిల్లీకి తీసుకువస్తున్నారు. రాబోయే రెండ్రోజుల్లో వీరంతా ఢిల్లీకి చేరుకుంటారు. కాగా, ఇరాన్‌లో ఉంటున్న భారతీయ విద్యార్థులతో వస్తున్న తొలివిమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు న్యూఢిల్లీ చేరే అవకాశం ఉంది. రెండో విమానం శనివారం ఉదయం, మూడో విమానం అదేరోజు సాయంత్రం ఇండియాకు చేరుకుంటాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుండటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసివేసింది. అయితే ఇండియా కోసం ప్రత్యేకమైన క్యారిడార్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తరలించేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించింది. ఇరాన్‌లో 4,000 మందికి పైగా భారతీయులు నివసిస్తుండగా, వీరిలో సగం మంది విద్యార్థులు ఉన్నారు. 'ఆపరేషన్ సింధు' కింద భారత ప్రభుత్వం 110 మంది భారతీయ విద్యార్థులను ఇప్పటికే న్యూఢిల్లీకి తీసుకువచ్చింది. వీరంతా ఇరాన్ నుంచి అర్మేనియా చేరుకోవడంతో అక్కడి నుంచి వారిని ప్రత్యేక విమానంలో ఢిల్లీ తీసుకువచ్చారు. వారం క్రితం ఇజ్రాయెల్ చేసిన మెరుపు దాడులతో ఇరాన్‌లోని అనేక స్థావరాలు ధ్వంసమయ్యాయి. అనంతరం ఇజ్రాయెల్‌పై క్షిపణి, డ్రోన్‌లతో టెహ్రాన్ ప్రతిదాడులకు దిగింది. ఈ నేపథ్యంలోనే తన గగనతలాన్ని మూసివేయడంతో అంతర్జాతీయ విమాన సర్వీసులు నిలిచిపోయాయి. తాజాగా భారతీయ విద్యార్థులను తరలించేందుకు ఇరాన్ ప్రత్యేకంగా మినహాయింపు ఇవ్వడంతో తరలింపు ప్రక్రియ సులభం కానుంది. ఇదిలాఉంటే, ఇరాన్‌లో దాదాపు 4వేల మంది భారతీయులు ఉండగా.. అందులో 2వేల మంది విద్యార్థులేనని సమాచారం.

# కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరాం

### పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,జూన్ 20(నిఘా న్యూస్):** మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరామని, డీసీసీ పరిశీలకుడి నుంచి నివేదిక వచ్చాక స్పందిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కొండా మురళి పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్ రెడ్డిపై ఘాటు వ్ఆయఖ్యలు చేశారు. ఇకపోతే సంబంధం లేని పంచాయతీ ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆయనకు సూచించినట్టు తెలిపారు. న్యాయస్థానంలో ఉన్న అంశంపై పొంగులేటి మాట్లాడటంపై తాను అభ్యంతరం వ్యక్తం చేసినట్టు వివరించారు. పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు మాట్లాడిన మాటలే తప్ప వేరే ఉద్దేశం కాదని పొంగులేటి చెప్పినట్లు వివరించారు. న్యాయస్థానం తీర్పు తర్వాతనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా తమ పరిధిలో లేని అంశాలను మాట్లాడవద్దని సూచించారు. ఇతరుల శాఖల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. విధానపరమైన అంశాల విషయంలో పార్టీపరంగా చర్చించి, మంత్రి మండలిలో నిర్ణయం తీసుకున్న అంశాలపై మాట్లాడితే ఎలాంటి అభ్యంతరం ఉండదని వివరించారు. అలా కాకుండా అంతర్గతంగా మాట్లాడుకున్న అంశాలను మీడియాతో మాట్లాడవద్దని మాత్రమే తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో తానే అభ్యర్థిని అని అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. గతంలో పోటీ చేసినందున తిరిగి తననే పోటీలో నిలుపుతారన్న భావనతో చెప్పి ఉంటారని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు వివరించారు.

# జగన్ మారాలి...

## లేదంటే మేమే మార్చుతాం : గునుపే భరత్

- ఇంకా ఎన్నాళ్లు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తావు
- గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా సిగ్గులేని రాజకీయాలు చేస్తున్నావు



**గోకవరం, జూన్ 20 (నిఘా న్యూస్):** వైసీపీ ప్రభుత్వంలో నీ నాయకులకి నేర్పిన అలవాట్లు గంజాయి, బెట్టింగ్ బ్యాచ్, రౌడీలు, హత్యలు అత్యాచారాలు చేసే వారిని పరామర్శిస్తూ విగ్రహాలు పెడుతూ రాజకీయాల్లో కొత్త విధానాలు తెస్తున్నావు. రౌడీయిజం చేసిన వారు, ఊళ్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వాళ్లు నీ దృష్టిలో హీరోలా బెట్టింగ్ కారణంగా ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తారా. ఆ సమయంలో ఇద్దరు చనిపోతే కనీసం వారిని చూడటానికి వెళ్ళావా బెట్టింగ్ గొడవలతో చనిపోయిన ప్రాణానికి ఉన్న విలువ. వాళ్లు చంపిన వారికి లేదా. వారిది ప్రాణం కాదా వారు మనుషులు కారా నువ్వు పరామర్శకు వెళ్లాలంటే మూడు కార్లు,100 మందితో కలిసి వెళ్లేందుకు అనుమతి ఇస్తే చాలదా ఇరుకు సందుల్లోకి పోయి సమావేశాలు పెట్టడం తొక్కిసలాట జరగడం తర్వాత హింసను ప్రేరేపించడం తిరిగి పోలీసులపై బురద జల్లడం ఏంటి, వైకాపా పాలనలో చేసిన అన్యాయాలు అక్రమాలపై ఏ విధమైన కేసులు పెట్టకుండా వారిని కాపాడుకుంటూ వచ్చి రాష్ట్రాన్ని గూండా రాష్ట్రముగా రౌడీ రాష్ట్రంగా చేశావు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఉంటే అక్రమ అరెస్టులని, మీ అనుకూల మీడియాతో దుష్ప్రచారం చేస్తు రాష్ట్రంలో శాంతి భద్రతలను సృష్టించాలని ప్రయత్నం చేస్తున్నావు. కనుక రాష్ట్ర భద్రత కోసం శాంతి భద్రతల అదుపు కోసం నీ మీద చర్యలు తప్పవు అని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి గునిపె భరత్ హెచ్చరించారు.

# అక్రమ ఇసుకను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

## తూప్రాన్ ఎస్ఐ శివానందం



**తూప్రాన్, జూన్20 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని కిస్టాపూర్ హల్ది వాగు నుండి గత కొంతకాలంగా అక్రమంగా ఇసుకను తవ్వి అమ్ము కుంటున్నారని సమాచారం రావడంతో ఆ మేరకు తూప్రాన్ ఎస్ఐ శివానందం మండల అధికారి ఆర్ ఐ, ఎలక్ట్రిసిటీ అధికారి కలిసి కిష్టాపూర్ హల్దీ వాగు ఇసుక స్థావరం వద్దకు చేరుకొని అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. యదేచ్ఛగా అక్రమంగా ఇసుక కార్యకలాపాలు కొన సాగిస్తున్న కిష్టాపూర్ గ్రామవాసి కిషోర్ పై క్రిమినల్ కేసును నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ శివానందం తెలిపారు. ఇందులో మండల అధికారి ఆర్ఐ. ప్రేమ్ కుమార్, ఎలక్ట్రిసిటీ సిబ్బంది ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత




**ధర్మపురి జూన్ 20 (నిఘా న్యూస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు ధర్మారం మండలం చామనపల్లి గ్రామంలో 14మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు.రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు చామనపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామపంచాయతీ ఆవరణలో అందజేశారు. ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు ఈదుల రాజేందర్ రెడ్డి,గౌడ గోవిందు, సుందరగిరి నరసయ్య, సిరికొండ స్వరూప, బైర సునీత పాల్గొన్నారు.

# కడియం శ్రీహరి.. నల్లికుట్ల మనిషి

- నేను మంత్రిగా ఉంటే తట్టుకోలేక పోతుండు
- అదృష్టం బావుండి ఆయన కూతురు ఎంపీ అయ్యింది
- నా కూతురు కాలేక పోయింది
- ఆగమశాస్త్రం ప్రకారమే భద్రకాళి అమ్మవారికి బోనం
- తెలంగాణ పుష్కరాలకు 200 కోట్లు కేంద్రం ఇవ్వాలి
- మంత్రి కొండ సురేఖ సంచలన వ్యాఖ్యలు




**వరంగల్,జూన్20(నిఘా న్యూస్):** ఉమ్మడి వరంగల్ లోని కాంగ్రెస్ కీలక నేతలపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆమె మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి సురేఖ కౌంటర్ ఇచ్చారు. భద్రకాళీ టెంపుల్ ఎవరి సొత్తు కాదు. కొందరు తమ సొత్తు అన్నట్లు ఫీల్ అవుతున్నారు. నాయిని రాజేందర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడడం సరికాదు. ఆయన అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఆగమశాస్త్రం ప్రకారమే భద్రకాళి అమ్మవారికి బోనం సమర్పించాలని నిర్ణయం తీసుకున్నాం. అక్కడ యాటలు కోస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అమ్మవారు శాఖాహారి అని అందరికీ తెలుసు. అక్కడ ఏళ్లుగా పనిచేస్తున్న పూజార్ల అభిప్రాయం తీసుకున్నాం. బల్కంపేట దేవాలయం నుంచి బోనం తీసుకువెళ్లి భద్రకాళి అమ్మవారికి సమర్పిస్తామని కొండా సురేఖ స్పష్టం చేశారు.

◆ 'కడియం శ్రీహరి నల్లికుట్ల మనిషి అని, నేను మంత్రిగా ఉంటే తట్టుకోలేపోతున్నాడు. ముఖ్యంగా నా ముందు కూర్చోవడానికి నామోషీగా ఫీల్ అవుతున్నాడు. అందుకే నా మంత్రి పదవి పోతుందంటూ తప్పుడు ప్రచారం చేపిస్తున్నాడు. తరచూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వద్దకు వెళ్లి నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. తెలుగు దేశంలో నడిపించుకున్నట్లు ఇక్కడ కూడా నడిపించాలని అనుకుంటున్నాడు. కానీ కాంగ్రెస్‌లో అలా నడవదు. నాకు అదృష్టం ఉంది కాబట్టి మంత్రి అయ్యాను. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అయ్యాడు.తరచూ నేను దిగిపోవాలని మాట్లాడటం సరికాదు. నా కూతురికి అదృష్టం లేదు ఎమ్మెల్యే కాలేదు.కడియం కూతురికి అదృష్టం ఉంది ఎంపీ అయ్యిందని కొండా సురేఖ హాట్ కామెంట్స్ చేశారు. అంతేగాకుండా గోదావరి పుష్కరాల విషయంలో కేంద్రం రెండు రాష్ట్రాలను సమానంగా చూడాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పుష్కరాలకు రూ.200 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలు ఏపీ కంటే తెలంగాణలోనే ఎక్కువ జరుగుతాయని, భద్రాచల రాముడి పాదాల నుంచే గోదావరి ప్రవహిస్తుందని చెప్పారు. కేంద్రం తెలంగాణ మీద వివక్ష చూపొద్దు. కిషన్ రెడ్డి, సంజయ్ చొరవ తీసుకోవాలని తెలంగాణకు పుష్కరాల నిధులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ చేతకాని మంత్రులుగా మిగిలిపోతారని తీవ్ర విమర్శలు చేశారు.

# కమిషన్ల కోసం కాంట్రాక్టర్లను వేధిస్తున్న నేతలు

- ముగ్గు పోసినా ఇల్లు కట్టినా వాలిపోవడం దుర్మార్గం
- ఇటువంటి వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు
- గోల్నాక కార్పొరేటర్ లావణ్య హెచ్చరిక
- డబ్బుల కోసం కాంట్రాక్టర్లను బెదిరిస్తున్న వ్యక్తులపై చర్యలు తప్పవు
- గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్



**అంబర్‌పేట, జూన్ 20 (నిఘా న్యూస్):** గోల్నాక డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్న కాంట్రాక్టర్ ల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం శంకర్ నగర్ లోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ మీడియాతో మాట్లాడుతూ డివిజన్ కు చెందిన కొంతమంది వ్యక్తులు కాంట్రాక్టర్లను డబ్బుల కోసం బెదిరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి, జలమండలికి సంబంధించి అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లను సదరు వ్యక్తులు డబ్బుల కోసం వేధిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తాము అడిగినన్ని డబ్బులు ఇవ్వకపోతే కాంట్రాక్టర్లపై లేనిపోని ఆరోపణలు చేస్తూ సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ బెదిరిస్తున్నారని కార్పొరేటర్ తెలిపారు. ఇటీవల తిరుమల నగర్ కాలనీలో సిసి రోడ్డు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ను సైతం ఓ వ్యక్తి డబ్బుల కోసం బెదిరించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

◆ అదేవిధంగా డివిజన్ పరిధిలో కొత్తగా ఇండ్లు, భవనాలు నిర్మిస్తున్న సామాన్య ప్రజలను సైతం సదరు వ్యక్తులు వదలడం లేదని, వారిని కూడా డబ్బుల కోసం వేధిస్తున్నారని కార్పొరేటర్ తెలిపారు. తమకు డబ్బులు ఇచ్చి ఇండ్లు కట్టుకోవాలని అంటున్నారని, డబ్బులు ఇయ్యని పక్షంలో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారని కార్పొరేటర్ చెప్పారు. ఇప్పటికైనా సదరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడడం మానుకోవాలని, లేనిపక్షంలో వారిపై పోలీసు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డివిజన్ కార్పొరేటర్ గా తనను దీవించిన ప్రజలకు, ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిజాయితీగా వారికి సేవ చేస్తానన్నానని కార్పొరేటర్ తెలిపారు.

# కబ్జాల నుండి ప్రభుత్వ భూములను కాపాడాలి

## జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**శామీర్‌పేట/కలెక్టరేట్, జూన్ 20 (నిఘా న్యూస్):** జిల్లాలోని ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణల నుండి కాపాడాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తహసీల్దార్లకు సూచించారు. శుక్రవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసీ హాల్‌లో రెవెన్యూ భూసమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. మండలాల వారీగా భూ సమస్యలపై వివరంగా తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దార్లతో అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలను, సూచనలకు కలెక్టరు అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఆటో మోడ్‌లో ట్రాఫిక్ నియంత్రణ

- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గూగుల్ సహకారం
- ఈగల్ వ్యూ తో సమస్యల పరిష్కారానికి ముందస్తు సూచనలు
- ట్రాఫిక్ సమస్యలపై సిపి, సివి ఆనంద్ సమీక్ష సమావేశం



**హైదరాబాద్, జూన్ 20(నిఘా న్యూస్):** హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు బి.కె..రాహుల్ హెగ్డే,ఎన్.అశోక్ కుమార్,వెంకటేశ్వర్లు, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డెవిస్, ఏసీపీలు, అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన ఇన్స్పెక్టర్లు ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణ ప్రాథమిక సూత్రాలపై సిపి పలు సూచనలు చేశారు. అనంతరం సిపి మాట్లాడుతూ గత ఏడాది వరకు నగరంలో వాహనాల సగటు వేగం 17 నుండి 18 కిలోమీటర్లు ఉండేదని, ప్రస్తుతం అది 24 నుండి 25 కిలోమీటర్లకు పెరిగిందని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఎంతో కష్టపడితేనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ సుమారు 1600 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని, మూడు కమిషనరేట్ల పరిధిలో కలిపి ఒక్క రోజుకు 91 లక్షల వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయని సిపి పేర్కొన్నారు. ఆపరేషన్ రోప్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని,దీనిని మరింత శాస్త్రీయ పద్ధతిలో బలోపేతం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. వీఐపీల రాకపోకలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, తన ప్రయాణ సమయాల్లో ఎక్కువ సేపు ట్రాఫిక్‌ను నిలపవద్దని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అందుకు అనుగుణంగాపనిచేస్తున్నామని,ఇది మాకు చాలా ఆనందాన్ని కలిగించిందని సిపి తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 శాతం సిగ్నల్స్ ఆటో మోడ్‌లో నడుస్తున్నాయని, దీనివల్ల ట్రాఫిక్ త్వరగా క్లియర్ అవుతుందన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై జరిమానాల విధింపులో సంఖ్యకు కాకుండా నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, దీనివల్ల ట్రాఫిక్ జరిమానాలు తగ్గాయని సిపి గుర్తు చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్‌ను డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని,ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగు పరచడానికి గూగుల్ కంపెనీ సహాయం తీసుకుంటున్నామని తెలిపారు. గూగుల్ మ్యాప్స్‌తో పాటు, గూగుల్ సాంకేతికంగా సహకరిస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలోని ఎత్తైన బహుళ అంతస్తుల భవన యజమానుల సహకారంతో అటువంటి 25 భవనాలపై 'హై రేస్ కెమెరాలను' బిగించి 'ఈగల్ వ్యూ'ను సేకరిస్తున్నామని తెలిపారు. వాటి ద్వారా ట్రాఫిక్ అధికారులు ముందస్తుగా ట్రాఫిక్ సమస్యలను గుర్తించి, స్థానిక ట్రాఫిక్ అధికారులను అప్రమత్తం చేయడం దానికి తగ్గట్టు పరిష్కార మార్గములను సూచించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సిబ్బంది కొరత ఉన్నందున,'ట్రాఫిక్ మార్షల్' వ్యవస్థను ప్రవేశపెడుతున్నామన్నారు.

# ఆర్పీఎల్‌లో హైదరాబాద్ హీరోస్ హ్యాట్రిక్ విజయం



**హైదరాబాద్, జూన్20 (నిఘా న్యూస్):** జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్(ఆర్పీఎల్) తొలి సీజన్‌లో హైదరాబాద్ హీరోస్ మరో సంచలన విజయంతో హ్యాట్రిక్ సాధించిందని ఆర్పీఎల్ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హీరోస్ 43-12 స్కోరు తేడాతో కళింగ బ్లాక్ టైగర్స్ ను చిత్తు చేసిందన్నారు. వరుసగా మూడో విజయంతో హీరోస్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ హీరోస్ ఏడు ట్రైలను సాధించిందన్నారు. జట్టులోని ఆరుగురు ఆటగాళ్లు ట్రైలు చేసి తమ సత్తా చాటారని తెలిపారు. జోజి నాసోవా రెండు ట్రైలతో అద్భుత ప్రదర్శన కనబరచగా, టెరియో తమాని నాలుగు ట్రైలను కన్వర్ట్ చేసి జట్టుకు అదనంగా ఎనిమిది పాయింట్లను అందించాడని తెలిపారు.


# జర్నలిస్టును బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు



**మేడిపల్లి, జూన్ 20 (నిఘా న్యూస్):** విధి నిర్వహణనలో ఉన్న జర్నలిస్ట్ ను బెదిరించడంతో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మేడిపల్లి సిఐ గోవింద్ రెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళ్ళితే మేడిపల్లి మండల జర్నలిస్టు, విధి నిర్వహణలో భాగంగా అక్రమ నిర్మాణంపై కథనం వ్రాయడంతో బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీకి చెందిన దయ్యాల మహేష్ అను వ్యక్తి జర్నలిస్ట్ ఇంటికి వెళ్ళి నువ్వు నా ఇంటిపై కథనం ఎలా వ్రాశావని, నీ అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడంతో ఆ వ్యక్తిపై విచారణ జరిపి 351(2), 351 బిఎన్ఎస్ సెక్షన్ల కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# ఐఐటీ హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు

## క్యూ ఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026లో 664వ స్థానం



**సంగారెడ్డి, జూన్ 20 (నిఘా న్యూస్):** ఐఐటీ హైదరాబాద్ ప్రపంచ స్థాయి విద్యా రంగంలో తన నిలకడైన పురోగతిని కొనసాగిస్తూ, క్యూ ఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026లో గ్లోబల్ ర్యాంక్ 664ను సాధించిందని ఐఐటి ప్రొఫెసర్ బిఎస్ మూర్తి పేర్కొన్నారు. గత ఏడాది 681–690బాండ్‌లో ఉండగా, ఈ సంవత్సరం స్పష్టమైన పురోగతితో ముందంజలో ఉన్నామన్నారు. వేశామన్నారు. ఇది విద్య, పరిశోధన మరియు ప్రపంచస్థాయి ప్రభావంపై ఐఐటీ హైదరాబాద్ చూపుతున్న ప్రత్యేకతను తెలుపుతుందన్నారు. ముఖ్యంగా, పరిశోధనా ప్రభావాన్ని సూచించే 'సిటేషన్స్ పర్ ఫ్యాకల్టీ'లో గ్లోబల్ టాప్ 10లో స్థానం దక్కించుకోవడం విశేషం. ఈ స్కోరు 2024లో 64.3 నుంచి 2025లో 71.1కి, 2026లో 84కి పెరిగిందన్నారు. ఐఐటి పురోగతి ప్రొఫెసర్స్ చేస్తున్న ప్రభావవంతమైన వివిధ అంతరశాఖల పరిశోధనలకు ప్రపంచ స్థాయిలో వస్తున్న గుర్తింపును ప్రతిబింబించేల చేస్తుందని తెలిపారు. అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థుల కలిసికట్టుగా చేసిన కృషికి సమ్మేళన మన్నారు. భారత్‌ను ప్రపంచ విద్యా పటంపై ప్రాతినిధ్యం చేయడం ద్వారా వహించడంపై గర్వపడుతున్నాము అన్నారు.ఆనంతరం ప్రొఫెసర్ అనామికా భార్గవ, నోడ్ ర్యాంకింగ్ కోఆర్డినేటర్, మాట్లాడుతూ యువతర ఐఐటీల్లో ఒకటిగా, వయస్సు అడ్డంకి కాదని మేం నిరూపిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ర్యాంకింగ్ మైలురాయితో, మేము పరిశోధన, అధ్యాపక నాణ్యత, విద్యార్థుల అనుభవాన్ని మెరుగుపరచడంపై మరింత దృష్టి సారించనున్నామని తెలిపారు. ఈ గణాంకాలను ఐఐటీ హైదరాబాద్ సాధించి అంతర్జాతీయ గుర్తింపు పొందినది అన్నారు. ఐఐటి మెరుగైన పలితాలను స్పష్టంగా చూపిస్తున్నాయన్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పరిశోధనల సహకారం, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెంపు వంటి అంశాల్లో కూడా ఐఐటీహెచ్ మరింత ముందుకు సాగుతోందన్నారు. ఐఐటీ హైదరాబాద్ 2008లో స్థాపించబడిన ఈ విద్యాసంస్థ, కేవలం 16 ఏళ్లలోనే పరిశోధన, టెక్నాలజీ అభివృద్ధి మరియు స్టార్టప్ రంగాల్లో విశేష ప్రతిష్టను సంపాదించిందన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, ఐఐటీహెచ్ గత రెండు సంవత్సరాలుగా ఇన్నోవేషన్‌లో 3వ స్థానం, ఇంజినీరింగ్ సంస్థలలో 8వ స్థానం దక్కించుకుంది.ప్రస్తుతం 325కు పైగా పూర్తి కాల అధ్యాపకులు, 5,200కు పైగా విద్యార్థులతో, 11,800ం ప్రచురణలు, 2.17 లక్షల సిటేషన్లు, 530కు పైగా పేటెంట్లు, 260ం స్టార్టప్‌లు (1100ం ఉద్యోగాల సృష్టితో), 2025 నాటికి ప్రతి రోజు ఓ పేటెంట్ సాధించాలన్న లక్ష్యంతో "పేటెంట్ మిషన్ 365" కొనసాగుతోందన్నారు. క్యూ ఎస్ ప్రతి సంవత్సరం విశ్వవిద్యాలయాల ప్రదర్శనను ఆధారంగా అంచనా వేసే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ. ఇది విద్యార్థులు, విద్యావేత్తలు పాలసీ మేకర్‌లకు నమ్మకమైన మార్గదర్శిగా నిలుస్తోంది.ఐఐటీ హైదరాబాద్ తాజా ర్యాంకింగ్ ద్వారా విద్యా, పరిశోధన అంతర్జాతీయ గుర్తింపులో దేశానికి గర్వకారణంగా నిలిచింది.

**చివరి మూడు సంవత్సరాల ఐఐటీహెచ్ ప్రదర్శనలో**

| సంవత్సరం | ఇండియా ర్యాంక్ | గ్లోబల్ ర్యాంక్ | సిటేషన్స్/ఫ్యాకల్టీ | అకడమిక్ రిప్యుటేషన్ | |
|---|---|---|---|---|---|
| 2026 | 17 | 664 | 84 | 10.3 | |
| 2025 | 17 | 681 | -690 | 71.1 | 6.2 |
| 2024 | 15 | 691 | -700 | 64.3 | 5.1 |

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com